
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 31 డిసెంబరు 2024



నేడే సామాజిక పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనవరి ఒకటో తేదీన ఇవ్వాల్సిన సామాజిక పింఛన్లను మంగళవారం పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లుచేసింది. జిల్లాలో 1,61,253 మంది పింఛనుదారుల కోసం ప్రభుత్వం రూ.69.84 కోట్లు విడుదల చేసింది. నాలుగు గ్రామీణ మండలాల పరిధిలో 26,681 మందికి రూ.11,15,61,000, జీవీఎంసీ పరిధిలో 1,34,572 మంది పింఛనుదారులకు రూ.58,68,91,500 అందజేయనున్నారు. పింఛన్‌దారులకు పంపిణీకి అవసరమైన సొమ్ములు సోమవారం సచివాలయ సిబ్బందికి అందజేశారు.

సంబరాలకు వేళాయె

- హోటళ్లలో నూతన సంవత్సర వేడుకల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు
- పలు చోట్ల ప్రత్యేక ఈవెంట్లు నిర్వహణ

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు నగరవాసులు సిద్ధమవుతున్నారు. హోటళ్లు, రిసార్ట్స్ నిర్వాహకులు లైవ్ ప్రోగ్రామ్స్ ఏర్పాటుచేస్తున్నారు. మంగళవారం రాత్రి రాడిసన్ బ్లూ హోటల్‌లో బాలీవుడ్ ... మిగతా 6వ పేజీలో

ఫిబ్రవరి 1 నుంచి భూముల విలువల సవరణ

- రిజిస్ట్రేషన్ల శాఖ విశాఖ డీఐజీ బాలకృష్ణ

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖ సవరించిన భూముల రేట్లను ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్నట్టు విశాఖపట్నం డీఐజీ బాలకృష్ణ సోమవారం తెలిపారు. జనవరి ఒకటి నుంచి కొత్త రేట్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తొలుత నిర్ణయించిందని, అయితే పెంచిన రేట్లపై మరోసారి సమగ్రంగా చర్చించాలని ఆదేశాలు రావడంతో వాయిదా వేయడం జరిగిందన్నారు. వచ్చిన అభ్యంతరాలను మరోసారి సమీక్షించుకొని, ఫైనల్‌గా రేట్లు ఖరారు చేసి ఫిబ్రవరి ఒకటి నుంచి అమలు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం జరిగిన సమావేశంలో సూచించారన్నారు. జనవరి 31వ తేదీ వరకు ప్రస్తుతం అమలులో ఉన్న ధరల ప్రకారమే స్టాంపు డ్యూటీ వసూలు చేస్తామని బాలకృష్ణ వివరించారు.

అభివృద్ధి దిశగా అడుగులు

పాలనను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం యత్నం

కీలక స్థానాల్లో కొత్త అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గడచిన ఏడాది రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాను ముందుకు నడిపించడానికి కీలక స్థానాల్లో అధికారులుగా కొత్తవారికి అవకాశం కల్పించింది. కలెక్టర్‌గా హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్‌గా శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్‌లు బాధ్యతలు చేపట్టారు.

కాలచక్రం 2024

పర్యాటకంగా చూసుకుంటే సందర్శకులకు ఈ ఏడాది నవంబరులో కైలాసగిరిపై స్కై సైక్లింగ్, జిప్ లైనర్ అందుబాటులోకి వచ్చాయి. యూహెచ్-3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం కూడా సిద్ధమవుతోంది. రుషికొండపై వైసీపీ హయాంలో రూ.500 కోట్లతో నిర్మించిన ప్యాలెస్‌ను సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పరిశీలించారు. అది పర్యాటకులకు ఉపయోగపడదని తేలిపోయింది. వీఎంఆర్‌డీఏ ఆర్‌కే బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జిని ప్రారంభించగా, అది 24 గంటలు తిరగకుండానే ముక్కలుగా తెగిపోయింది. నెల రోజులు కుస్తీ పట్టినా ఫలితం లేక ఎత్తేశారు.

- షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు నవంబరు 2న ఆరిలోవలో అకాడమీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాదిలో అందుబాటులోకి తెస్తామని ... మిగతా 6వ పేజీలో



రుషికొండ భవనాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)



కైలాసగిరిపై జిప్ లైనర్

పర్యాటకంగా మరో మెట్టు ఎక్కిన విశాఖ

- కైలాసగిరిపై స్కై సైక్లింగ్, జిప్ లైనర్
- ఐటీ రంగానికి ఊపిరిలూదిన మంత్రి లోకేశ్
- నగరానికి టీసీఎస్
- గూగుల్‌తోనూ ఒప్పందం
- స్టీల్‌ప్లాంటుకు కేంద్రం సాయం
- బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి పీవీ సింధు శ్రీకారం

ఐటీ మెరుపులు



టీసీఎస్ భవనం

విశాఖను ఐటీ హబ్‌గా మారుస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన నారా లోకేశ్ మంత్రిగాబాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లోనే టీసీఎస్ ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు. ఫిబ్రవరి 2025లోగా దాని కార్యకలాపాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. గూగుల్‌తోను ఒప్పందం చేసుకున్నారు.

కొత్తగా మూడు వందేభారత్ రైళ్లు

ఈ ఏడాది మార్చిలో విశాఖ ప్రజలకు కొత్తగా మూడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖకు అదనంగా మరో రైలు వేశారు. అదేరోజు విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు రైలు నడిపారు. సెప్టెంబరు 15న విశాఖ నుంచి దుర్గ్‌కు మరో వందేభారత్ రైలు వేశారు.





రెండు అణు జలాంతర్గాముల జల ప్రవేశం

విశాఖపట్నంలోని నేవీ షిప్ బిల్డింగ్ సెంటర్ అణు జలాంతర్గాముల నిర్మాణ కేంద్రంగా పేరు తెచ్చుకుంది. గతంలో ఐఎన్ఎస్ అరిహంత్‌ను తయారుచేయగా ఈ ఏడాది ఆగస్టు 29న ఐఎన్ఎస్ అరిఘాత్‌ను రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. అక్టోబరు 16న రహస్యంగా మరో అణు జలాంతర్గామి ఎస్-4ను ప్రారంభించారు. ఫిబ్రవరిలో నిర్వహించిన మిలాన్-24కు 50 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో మంటలు



ఆగస్టు 4వ తేదీన విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్ బీ-6, బీ-7 కోచ్‌ల్లో మంటలు చెలరేగాయి. రాయపూర్ నుంచి విశాఖపట్నం వచ్చిన ఈ రైలు కోచింగ్ కాంప్లెక్స్‌కు క్లీనింగ్ కోసం వెళ్లాల్సిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రయాణికులు అంతా దిగిపోయిన తరువాత ఈ ఘటన జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణం ఏమిటనేది తేల్చనే లేదు.

దొరికిపోయిన అధికారులు



వాల్తేరు డీఆర్ఎంగా పనిచేస్తున్న సౌరభ్ ప్రసాద్ ఓ రైల్వే కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ ముంబైలో సీబీఐకి దొరికిపోయి అరెస్టు అయ్యారు. ఆ తరువాత సస్పెండ్ అయ్యారు. జీవీఎంసీలో జోన్-2 కమిషనర్‌గా పనిచేస్తున్న సింహాచలం ఇళ్లపై ఏసీబీ అధికారులు సోదాలు చేసి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని అరెస్టు చేశారు.

నేరాలను నియంత్రించాం

- తగ్గిన హత్యలు, రోడ్డు ప్రమాదాలు
- స్వల్పంగా పెరిగిన అత్యాచారం కేసులు
- గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం
- రికవరీ చేసిన చోరీ సొత్తును బాధితులకు పంపిణీ చేసేందుకు 'క్రైమ్ ప్రాపర్టీ మేళా'ల నిర్వహణ
- నగరంలో శాంతి భద్రతలను కాపాడడమే లక్ష్యం
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ శాఖ తీసుకున్న చర్యల కారణంగా ఈ ఏడాది అన్ని రకాల నేరాలను తగ్గించగలిగామని సీపీ శంఖబ్రత బాగ్చి అన్నారు. పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వార్షిక నివేదికను ఆయన వెల్లడించారు. హత్యలు 2022లో 39, 2023లో 23 జరిగితే ఈ ఏడాది 22కి తగ్గాయన్నారు. దాడులు గత ఏడాది పది జరిగితే, ఈ ఏడాది ఏడుకు తగ్గాయన్నారు. కిడ్నాప్‌లు 2022లో 32, 2022లో 24 జరిగితే ఈ ఏడాది 21కి తగ్గాయన్నారు. కొట్లాట కేసులు మాత్రం 2022లో 534, 2023లో 399 నమోదైదే...ఈ ఏడాది 451కి పెరిగాయన్నారు. అత్యాచారాలు గత ఏడాది కంటే ఈ ఏడాది స్వల్పంగా పెరిగాయని, అయితే వాటిలో అత్యధికం పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన కేసులేనన్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో ఎఫ్ఐఆర్‌లను పరిశీలిస్తే 2022లో 10,929, 2023లో 7,979 నమోదైతే ఈ ఏడాది మాత్రం 9,142కి పెరిగాయన్నారు. ఈ ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరిగినందున ఎఫ్ఐఆర్‌ల సంఖ్య ... మిగతా 6వ పేజీలో

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు

- జీతం తీసుకోని నెలగా డిసెంబరు?
- సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించి కూడా బకాయిలు
- ఆందోళనలో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు



ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేతనాల కోసం ఉక్కు ఉద్యోగులు (నాన్-ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్), కాంట్రాక్టు కార్మికులు ఎదురుచూస్తున్నారు. డిసెంబరు నెల 30వ తేదీ వచ్చినా నవంబరు నెలకు సంబంధించిన వేతనాలు అందలేదు. గతంలో ఉద్యోగులకు ఏ నెలకు ఆ నెల చివరి తేదీన లేదా మరుసటి నెల ఒకటో తేదీన జీతాలు ఇచ్చేవారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెలా 5 నుంచి 10వ తేదీ మధ్య చెల్లింపులు జరిపేవారు. అలాంటిది ప్రస్తుతం వేతనాలు ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పలేని పరిస్థితి వచ్చింది. మూడు నెలల కిందటి వరకూ రెండు వాయిదాల్లో జీతాలు చెల్లిస్తుండేవారు. అయితే సెప్టెంబరు నుంచి పరిస్థితి మరీ దారుణంగా తయారయ్యింది. సెప్టెంబరు జీతం 50 శాతం అక్టోబరులో ఇచ్చారు. అక్టోబరు జీతం ఒకసారి 35 శాతం, మరోసారి 30 శాతం, మొత్తం 65 శాతం నవంబరులో ... మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

- ఆరు జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు
- పురుషులు 12,948, మహిళలు: 8,607
- అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది ఓటర్లు
- 2019 కంటే 1,968 మంది అధికం



విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా సోమవారం ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తుది జాబితా విడుదలచేశారు. ఆరు జిల్లాల పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 12,948 మంది పురుషులు కాగా 8,607 మంది మహిళలు. అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది, విజయనగరం జిల్లాలో 4,937, శ్రీకాకుళం జిల్లాలో 4,829, అనకాపల్లి జిల్లాలో 2,802, పార్వతీపురం మన్యంలో 2,262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 19,587. ఈ పర్యాయం ... మిగతా 6వ పేజీలో

తుది ఓటర్ల జాబితా

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం	3,275	1,554	4,929
విజయనగరం	3,100	1,837	4,937
పార్వతీపురం మన్యం	1,532	730	2,262
అల్లూరి సీతారామరాజు	891	557	1,448
విశాఖపట్నం	2,403	2,874	5,277
అనకాపల్లి	1,747	1,055	2,802
మొత్తం	12,948	8,607	21,555

సీపీఎం నిరసన

తగరపువలస,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు మూర్తి మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలన్నారు. దేశంలో దళిత, గిరిజన మహిళలపై దాడులు జరుగుతున్నప్పుడు మాట్లాడని ప్రధాని మోదీ, అమిత్ షాను వెనుకేసుకు రావడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్. నరసింగరావు, బి. లక్ష్మి, కె. నాగరాణి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌టీయూ

పద్మనాభం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. అలాగే సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రూ. 25 వేల కోట్ల బకాయిలను వెంటనే మంజూరు చేయాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

వేడుకల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు : సీఐ

పద్మనాభం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని సీఐ సీహెచ్ శ్రీధర్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు జరపరాదన్నారు. బైక్ రేసులు, ర్యాష్ డ్రైవింగ్, ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసి వేసి, అధిక శబ్దాలతో నడపడం నిషేధమన్నారు.

చంద్రంపాలెంలో దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

కొమ్మాది, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి, అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, పుష్పార్చన నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం దీపాలంకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కోశాధికారి నాగోతి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమ పాలన'

కొమ్మాది, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన సాగిస్తుందని టీడీపీ విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. పింఛన్ పొందుతున్న వ్యక్తి చనిపోతే అతని భార్యకు మరుసటి నెల నుంచి పింఛన్ ఇవ్వనున్నారని, నవంబరు 1 నుంచి డిసెంబరు 15 వరకు అటువంటి వారు రాష్ట్రంలో 5402 మంది ఉన్నట్టు తెలిపారు. వారితో పాటు వివిధ కారణాల వల్ల రెండు, మూడు నెలలుగా పింఛన్ తీసుకోని 50 వేల మందికి కూడా ఈనెల పింఛన్ ఇవ్వనున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తుందన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన దుప్పలపూడి ఈశా, శ్రీనివాసరావు దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో ఆలయ పీఆర్‌ఓ సూర్యనారాయణకు సోమవారం ఆయన అందజేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పిల్లా విజయ్

ఆనందపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షుడిగా పిల్లా విజయ్ ఎన్నికయ్యారు. సోమవారం వెల్లంకి గ్రామంలో ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు.

గుర్రంపాలెంలో అక్రమ మైనింగ్‌కు చెక్



తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి మండలం గుర్రంపాలెంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలను సోమవారం గనుల శాఖ విజిలెన్స్ ఏడీ అశోక్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి, అక్రమంగా మైనింగ్ చేస్తున్న వారికి మధ్య వాగ్వాదం జరిగింది. గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను, గ్రావెల్ లోడుతో ఉన్న మూడు లారీలను అధికారులు సీజ్ చేసి పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పూర్తి విచారణ జరిపి అక్రమంగా తరలించిన గ్రావెల్ ఎంతో అంచనా వేసి జరిమానా విధిస్తామని అధికారులు తెలిపారు.

ఘాట్ రోడ్డు నిర్మాణంలో జాప్యంపై అసంతృప్తి

- పద్మనాభుని ఆలయ అధికారులతో ఎమ్మెల్యే గంటా సమావేశం
- త్వరగా పనులు చేయాలని ఆదేశం



రోడ్డు పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గంటా



గంటాకు జ్ఞాపిక అందిస్తున్న లక్ష్మీప్రసాద్

పద్మనాభం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని గిరి ఘాట్ రోడ్డు నిర్మాణంలో జాప్యం పట్ల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఎంవీపీలోని తన క్యాంపు కార్యాలయంలో దేవస్థానం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టు విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, కాంట్రాక్టర్, అధికారులను హెచ్చరించారు. పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాల వల్ల పనులు చేయలేకపోయామని కాంట్రాక్టర్ చెప్పినా ఆయన సంతృప్తి చెందలేదు. నాణ్యతలో రాజీ పడకుండా ఘాట్ రోడ్డు, ప్రహరీ నిర్మాణాలు చేపట్టాలన్నారు. త్వరలో ఆలయానికి వచ్చి పనుల ప్రగతిని పరిశీలిస్తానన్నారు. పునర్నిర్మాణంలో ఉన్న ఆలయ శిఖర ప్రతిష్ఠ గురించి కూడా అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ నానాజీబాబు, పీఆర్ డీఈఈ రామ్మూర్తి, దేవదాయశాఖ ఏఈ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాలు లక్ష్యం

భీమిలి నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయాలన్న సంకల్పంతో కార్యకర్తలు శ్రమించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆయన నగరంలోని తన నివాసంలో నియోజకవర్గంలో మండలాలు, వార్డుల వారీగా పార్టీ నాయకులతో సభ్యత్వ నమోదుపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటిరకూ 80 వేల సభ్యత్వాలతో ఉత్తరాంధ్రలో భీమిలి నియోజకవర్గం మొదటి స్థానంలో వుందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో రెండవ అతిపెద్ద మెజారిటీ ఇచ్చిన నియోజకవర్గంగా భీమిలికి మంచి పేరు ఉందని,దానికి తగ్గట్టుగా లక్ష సభ్యత్వాల మార్కు సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు 1 నుంచి 8, 14,15, 45, 89, 98 వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి

విశాఖపట్నం : తెలుగుభాషాభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎంపీ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. ఇటీవల విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన తెలుగు రచయితల వివరాలు, మహాసభ తీర్మానాలు గంటాకు వివరించారు. మహాసభల జ్ఞాపికను అందజేశారు. మాతృభాషను రక్షించుకోవడం తెలుగువారందరి బాధ్యత అని ఈ సందర్భంగా గంటా పేర్కొన్నారు.

గోదాదేవికి ధనుర్మాస పూజలు



సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా శోభాయమానంగా తీర్చిదిద్ది పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్రోచ్చారణల నడుమ బేడా మండప తిరువీధి జరిపారు. అనంతరం అష్టదిక్పాలకు పూజలు చేశారు. ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో పూజలు చేసి గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 15వ పాశురాన్ని విన్నపాలు చేశారు.

రూ. 8 లక్షలతో మైక్‌లు ఏర్పాటు



సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై, కొండ దిగువన అను నిత్యం అప్పన్న నామ స్మరణ ప్రతిధ్వనించేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఆదేశించారు. ఈమేరకు దేవస్థానం ఈఈ బి. రాంబాబు, ఏఈ ఎస్. సన్యాసిరావు (తాతాజీ) పర్యవేక్షణలో ఘాట్ రోడ్డులో. మెట్ల మార్గంలో ఇప్పటికే ఉన్న బ్రాడ్ కాస్టింగ్ సిస్టమ్‌కు మరమ్మతులు చేపట్టడంతో పాటు నూతనంగా సుమారు రూ. 8 లక్షలతో మైక్‌లు ఏర్పాట్లు చేస్తున్నారు. గత మూడు రోజులుగా సిబ్బంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే ఇప్పటివరకు భక్తులకు వినిపించే దేవుడి గీతాల ప్రసారాన్ని పూర్తిగా నిలిపివేసి 'ఓం నమో నారసింహ' అన్న నామం నిరంతరం ప్రసారం చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

'పరీక్షా పే చర్చ' పై సమావేశం

భీమునిపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పరీక్షా పే చర్చా కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రు లు భాగస్వాములు కావాలని ఎంపీపీ వాసురాజు కోరారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఎంఈఓ మానేపల్లి శివరాణి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా ఎల్. సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, మండల నోడల్ అధికారిగా పి. మురళీమోహన్ వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 అట్టాడ జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల విక్రయాలు ప్రారంభం

సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ముద్రించిన నూతన క్యాలెండర్ల విక్రయాలను ఆలయ ఏఈఓ నక్కాన ఆనందకుమార్ సోమవారం నుంచి ప్రారంభించారు. భక్తులకు అందుబాటులో ఉండేలా ఆలయంలోని స్వామివారి మ్యూజియం సమీపంలో ఒక కేంద్రం, సింహగిరిపై టికెట్ల విక్రయాల కౌంటర్ల వద్ద మరో విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. క్యాలెండర్లలో స్వామివారి ఆలయంలో ఏడాది పొడవునా జరిగే వార్షిక, మాస, పక్ష, వార ఉత్సవాల వివరాలు పొందుపరచినట్టు ఏఈఓ చెప్పారు.

అభివృద్ధి పనులు పరిశీలన

సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ సాధారణ నిధులు రూ. 3 కోట్లతో 98వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ పిసిని వరాహనరసింహం సోమవారం పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

బాస్కెట్ బాల్ పోటీల విజేత సాగర్‌నగర్

సాగర్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ టోర్నీలో సాగర్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 26 నుంచి 29 వరకు సాగర్‌నగర్ బాస్కెట్ బాల్ మైదానంలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఛైర్మన్ ప్రసాద్, కార్పొరేటర్ లొడగల అప్పారావు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి బి. దొరబాబు, బి. శ్రీనివాస్, బాస్కెట్ బాల్ కోచ్ ఆర్ .సునీల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న మద్యం లోడ్ వ్యాన్

ఎండాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ జాతీయ రహదారిపై మద్యం లోడ్‌తో వేగంగా వెళ్తున్న మినీ వ్యాన్ అదుపు తప్పి. చెట్టును ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆనందపురం నుంచి సాగర్‌నగర్‌కి మద్యం లోడ్‌తో వస్తున్న మినీ వ్యాన్ ఎండాడ మహిళా పోలీసు స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి అదుపు తప్పింది.. అటుగా వెళ్తున్న రెండు బైక్‌లను ఢీకొడుతూ ఎండాడ కూడలిలో ఉన్న ఏసీపీ కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్టును ఢీకొంది. వ్యాన్ బ్రేకులు ఫెయిల్ కావడంతో వాహనం అదుపు తప్పినట్టు తెలిసింది.



చిన్నారావు, ఇతర సభ్యులను అభినందిస్తున్న గంటా నూకరాజు, తదితరులు

మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా చిన్నారావు

భీమునిపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎగువపేట గ్రామ మత్స్యకార సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా కారి చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆ సొసైటీ ఎన్నికలు ఫోర్ ఫెసిలిటీస్ సెంటర్‌లో మత్స్యశాఖ ఉద్యోగి డి. మురళి ఆధ్వర్యంలో జరిగాయి. ఉపాధ్యక్షుడిగా శీరం లక్ష్మణ, డైరెక్టర్లుగా ఉమ్మిడి చిన్న మసేను, శీరం పోలిరాజు, పుక్కళ్ల బాలాజీ, గరికిన ఎల్లాజి, కారి నానాజీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడుతూ నూతన కార్యవర్గం మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, నాయకులు వాసుపల్లి కొండబాబు, బర్రి కొండబాబు, అల్లిపిల్లి అప్పారావు, వాసుపల్లి జానకీరామ్, పైడిపల్లి నరసింగరావు, వాసుపల్లి గరగయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం పరిసరాలు శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పరిసరాలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

భీమునిపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిడిగట్టు అంగన్‌వాడీ భవనం పరిసరాలను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు ఎట్టకేలకు శుభ్రపరిచారు.మందుబాబులకు అడ్డాగా అంగన్‌వాడీ భవనం అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి జోనల్ కమిషనరు ప్రసన్న వాణి స్పందించారు. ఈమేరకు జోనల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు పారిశుధ్య కార్మికులతో అంగన్‌వాడీ భవనం వద్ద ఉన్న పరిసరాలను శుభ్రపరిచారు. అలాగే భవనం చుట్టూ పేరుకుపోయిన ఖాళీ మద్యం సీసాలు, వాడిపడేసిన వాటర్ బాటిల్స్ , గ్లాసులను తొలగించారు. ఇకపై కేంద్రం వద్ద మందుబాబులు మద్యం సేవిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

వీధి లైట్లకు మరమ్మతు

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డులోని విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీలోని విద్యుత్ లైట్లకు విద్యుత్ శాఖాధికారులు మరమ్మతు చేశారు. వీధి లైట్లు వెలగక అవస్థలు అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన వార్తకు వారు స్పందించారు. ఈమేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీల్లో పాడైన లైట్లను బాగు చేశారు.

భైరవస్వామికి అమావాస్య పూజలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అడవివరంలో ఉన్న భైరవస్వామికి మార్గశిర మాస అమావాస్య పురస్కరించుకుని భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేకువజాము నుంచే ఉత్తరాంధ్ర నలు మూలలతో పాటు ఒడిశా సరిహద్దు జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. సకల గ్రహ దోషాల నివృత్తికి భైరవస్వామికి క్షీరంతో అభిషేకాలు చేసి వడమాలతో పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా గోపాలపట్నం స్టేషన్ హౌస్ ఆఫీసర్ అప్పలరాజు సారథ్యంలో పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు.

శాస్త్ర విజ్ఞానం పట్ల అవగాహన

సాగర్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానం పట్ల అవగాహన పెంచడంతో పాటు నూతన ఆలోచనలను రేకెత్తించేలా సైన్స్ ప్రయోగాలు చేపట్టనున్నట్టు గీతం అధికా రులు తెలిపారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం, నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ సహకారంతో గీతం వర్సిటీ లెట్‌అజ్‌డుసైన్స్ పేరిట ప్రత్యేక ప్రాజెక్టు అమలు చేస్తున్నారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖతో కలిసి ఆనందపురం, నరవ, చంద్రంపాలెం, చింతల అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వారం రోజులుగా పలు కార్యక్రమాలు చేపట్టినట్టు ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ డాక్టర్ బి. స్పందన తెలిపారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే చర్యలు

- వచ్చే నెల నుంచి అమలు
- భీమిలి జడ్సీ ప్రసన్న వాణి



భీమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది



ఎండాడ : మహిళకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

భీమునిపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నామని జడ్సీ ప్రసన్నవాణి తెలిపారు. సోమవారం ఆమె వాసవి ప్రార్థనా మందిరంలో వర్తకులు, ప్రజలతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనుషుల మనుగడకు తీవ్ర నష్టం కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందన్నారు. ప్రజలు సంబంధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా సహకరించాలని కోరారు.అనంతరం పారిశుధ్య కార్మికులు,ప్రజలు అవగాహన ర్యాలీ చేసి, చిన్నబజారు జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. మహాలక్ష్మినాయుడు, వార్డు సచివాలయం పర్యావరణ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీల రేగాని రవి, రామశర్మ, రమేష్, వర్తక సంఘం నాయకులు బంగార్రాజు, రమణమూర్తి పాల్గొన్నారు.

తగరపువలస : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు తగరపువలసలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. మహాలక్ష్మినాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయాల సిబ్బంది, పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

ఎండాడ : వచ్చే నెల 1 నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం అమలు నేపథ్యంలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (ఏఎంవోహెచ్) ఎన్. కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఆనందపురం మార్కెట్ నుంచి వచ్చే ఆటోలను ఎండాడ కూడలిలో ఆపి, వ్యాపారులకు అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె. రవి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో అడివివరం విద్యార్థిని ప్రతిభ

సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ పోటీల్లో అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వి. చైత్ర వర్షిణి ప్రథమ స్థానంలో నిలిచింది. పోటీల్లో జీవ వైవిధ్యం, మృత్తికా ఆరోగ్యం అన్న అంశంపై ఆమె చేసిన ప్రజెంటేషన్‌కు మొదటి బహుమతి లభించింది. బాలికను పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధి దిశగా అడుగులు

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు.

స్టీల్‌ప్లాంటుకు కూటమి సాయం

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా దానిని కాపాడతామని ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కార్మికులకు భరోసా ఇచ్చారు. ఈమేరకు ఢిల్లీ పెద్దలతో కూటమి నేతలు మాట్లాడి రెండు విడతలుగా రూ.1,650 కోట్ల ఆర్థిక సాయం అందించారు. భారీ ప్యాకేజీ కోసం మంతనాలు జరుపుతున్నారు. మరోవైపు స్టీల్‌ప్లాంటు వీఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. సీఎండీ అతుల్‌భట్‌ను పదవీకాలం పూర్తికాక ముందే దీర్ఘకాలిక సెలవులో పంపించింది. శక్తిమణిని సీఎండీగా ఎంపిక చేయగా, ఆయన్ను కాదని ఎంఓఐఎల్ నుంచి సక్సేనాను తీసుకువచ్చారు. హెచ్‌బీ కాలనీలో స్టీల్‌ప్లాంటు భూములు యాజమాన్యం విక్రయించాలని యత్నించగా హైకోర్టు ఏప్రిల్ 25న స్టే విధించింది.

డీప్ టెక్నాలజీపై సీఎం సదస్సు

సీఎం చంద్రబాబునాయుడు డిసెంబరు 6వ తేదీన నోవాటెల్‌లో డీప్ టెక్నాలజీపై సదస్సు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి టెక్నాలజీ రంగంలో వస్తున్న నూతన పోకడలను ఆయన తెలుసుకున్నారు.

- మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సెప్టెంబరులో దాడులు నిర్వహించి మనీ ల్యాండరింగ్‌కు సంబంధించి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు శివాజీపాలెంలోని ఆయనకు చెందిన భవనంలో వ్యభిచారం జరుగుతున్నట్టు పోలీసులు కేసు పెట్టారు.

పదవులు...బాధ్యతలు

మిజోరాం గవర్నర్‌గా ఉన్న కంభంపాటి హరిబాబును కేంద్రం ఒడిశా గవర్నర్‌గా నియమించింది. గిరిజన సహకార సంస్థ ఛైర్మన్‌గా కిడారి శ్రావణ్‌కుమార్ నవంబరు 18న, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్‌గా ప్రణవ్ గోపాల్ నవంబరు 25న బాధ్యతలు చేపట్టారు. జూన్ 14న పల్లా శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకున్నారు.

● విశాఖకు డ్రగ్స్‌తో వచ్చిన కంటెయినర్‌ని సీబీఐ అధికారులు మార్చి నెలాఖరును సీజ్ చేశారు. ఆ తరువాత దానిపై విచారణ చేసి దొరికినవి డ్రగ్స్ కాదని డిసెంబరులో కేసును మూసివేశారు.

దిద్దుబాటు చర్యలు

శారదా పీఠానికి భీమిలి సమీపాన కేటాయించిన 15 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 19న రద్దు చేసి వెనక్కి తీసుకుంది. భీమిలి బీచ్‌లో సాయిరెడ్డి కుమార్తె నేహా రెడ్డి అక్రమంగా నిర్మాణాలు చేపడుతుండగా వాటిని హైకోర్టు ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు కూలగొట్టారు. ఎండాడ హయగ్రీవ ప్రాజెక్టులో నిబంధనలు ఉల్లంఘించారని సీసీఎల్‌ఏ అనుమతులు రద్దుచేసింది. విశాఖ డెయిరీలో అక్రమాలు జరుగుతున్నాయని విచారణకు స్పీకర్ సభా సంఘాన్ని వేయగా ఆ కమిటీ విచారణ ప్రారంభించింది.

సంబరాలకు వేళాయె

... 5వ పేజీ తరువాయి

డీజే, సింగర్ కారుణ్య లైవ్ ప్రోగ్రామ్, నోవాటెల్‌లో 'రోరింగ్ ట్వంటీస్', ఫోర్ పాయింట్స్ షెరటాన్ హోటల్‌లో 'టోటో వుడ్' పేర్లతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు బీచ్‌రోడ్డు లోని ప్రముఖ హోటళ్లు, రిసార్ట్స్‌లో నూతన సంవత్సర వేడుకలను గ్రాండ్‌గా నిర్వ హించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సింగిల్, కపుల్స్‌కు ఎంట్రీ పాస్‌లు విక్రయి స్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతోపాటు కొన్ని కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగు లకు ప్రత్యేక పాస్‌లను కొనుగోలు చేసినట్టు తెలిసింది. అదేవిధంగా పలు అపా ర్టుమెంట్‌లు, గ్రూపు హౌస్‌లలో డిన్నర్‌తో పాటు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, గేమ్స్ వంటివి నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

స్వల్పంగా పెరిగారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గత నెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. ఆ ప్రక్రియ ముగియడంతో సోమవారం ఎన్నికల అధికారి తుది జాబితా విడుదల చేశారు. గత నెల 23న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 15,297 మంది ఓటర్లు ఉండగా అభ్యంతరాలు స్వీకరించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా 19 మంది ఓటర్లపై అభ్యంతరాలు రాగా వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. కొత్తగా పురుషులు 3,325, మహిళలు 2,962 మంది వెరసి 6,287 మంది దరఖాస్తు చేయగా పరిశీలించి అందరినీ ఓటర్ల జాబితాలో చేర్చారు. ఇదిలావుండగా వచ్చే ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తరువాత మరోసారి ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వనున్నది.

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. నవంబరు నెల జీతం ఇప్పటివరకూ ఇవ్వలేదు. ఇక కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి అయితే చెప్పాల్సిన పనిలేదు. కొన్ని విభాగాల్లో అయితే ఆరేడు నెలలు, మరికొన్ని విభాగాల్లో అయితే నాలుగు నెలల నుంచి జీతాలు చెల్లించలేదు. జీతం బకాయిలు కనీసం సంక్రాంతి పండుగ ముందైనా చెల్లించాల్సిందిగా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు.

నేరాలను నియంత్రించాం

... 5వ పేజీ తరువాయి

పెరిగిందన్నారు. తాము తీసుకున్న చర్యల కారణంగా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలిగామన్నారు. 2022లో 1,353, 2023లో 1,180 ప్రమాదాలు జరిగితే, ఈ ఏడాది 1,094కి తగ్గాయన్నారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా గత ఏడాది 1,44,907 కేసులు నమోదుచేసి రూ.16.22 కోట్లు జరిమానా విధిస్తే, ఈ ఏడాది 1,63,913 కేసులు నమోదుచేసి రూ.25.67 కోట్లు జరిమానా విధించామన్నారు. రోడ్డు ట్రాఫిక్ ఇంజనీరింగ్ పేరుతో 35 కూడళ్లను అభివృద్ధి చేయడంతో పాటు రాత్రిపూట లైటింగ్ పెంచామన్నారు. గంజాయి రవాణాదారులు, స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపామన్నారు. గత ఏడాది ఎన్‌డీపీఎస్ కింద 235 కేసులు నమోదుచేసి 704 మందిని అరెస్టు చేసి 4,700 కిలోల గంజాయిని సీజ్ చేస్తే, ఈ ఏడాది 313 కేసులు నమోదుచేసి 718 మందిని అరెస్టు చేసి 5,024 కిలోల గంజాయితోపాటు, 132 గంజాయి చాక్లెట్‌లను సీజ్ చేశామన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు విరివిగా అవగాహన కల్పించడంతో కేసుల సంఖ్య ఈ ఏడాది కాస్త తగ్గిందన్నారు. 2022లో 613 కేసులు, 2023లో 419 కేసులు నమోదైతే ఈ ఏడాది 364కి తగ్గినట్టు చెప్పారు. సైబర్ నేరగాళ్లు ఉపయోగించిన 2520 బ్యాంకు ఖాతాల్లో రూ.20.42 కోట్లు ఫ్రీజ్ చేసి, రూ.రెండు కోట్లు బాధితులకు అందజేశామన్నారు. నగరంలో తరచూ అల్లర్లు, దాడులు, హత్యలకు పాల్పడడం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిని గుర్తించి షీట్‌లు తెరిచామన్నారు. ఈ ఏడాది 175 మందిపై సస్పెక్ట్ షీట్లు, 176 మందిపై రౌడీ షీట్లు తెరిచామన్నారు. మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, లైంగిక దాడులకు పాల్పడుతున్న 35 మందిపై రాష్ట్రంలోనే మొదటిసారిగా పియాడియోఫిల్ షీట్‌లు తెరిచామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న 35 మందిపై డ్రగ్ అఫెండర్ షీట్, భూకబ్జాలకు పాల్పడుతున్న ముగ్గురిపై లాండ్ గ్రాబర్‌షీట్, సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఒకరిపై సైబర్ బుల్లీ షీట్ తెరిచామన్నారు. చోరీ కేసుల్లో రికవరీ చేసిన సొత్తును కోర్టు అనుమతితో 'క్రైమ్ ప్రాపర్టీ మేళా' నిర్వహించి బాధితులకు వెంటనే అందజేస్తున్నామన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా హోంగార్డు నుంచి ఉన్నతాధికారుల వరకూ అందరికీ ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించబోతున్నామన్నారు. ప్రజలకు పోలీస్ సహాయం అవసరమైనప్పుడు కిందిస్థాయి పోలీసులు స్పందన సరిగా లేదనిపిస్తే నేరుగా తనను ఫోన్‌లో సంప్రతించేలా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సీపీ హెల్ప్‌లైన్ పేరుతో మొబైల్ నంబర్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, క్రైమ్ డీసీపీ లతామాధురి, స్పెషల్ బ్రాంచి డీసీపీ పి.శ్రీనివాసరావు, క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అకడమిక్ స్టాఫ్ కళాశాలలో స్వచ్ఛ భారత్


షెడ్డుపై చెట్ల కొమ్మలు తొలగిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని యూజీసీ అకడమిక్ స్టాఫ్ కళాశాల (ఎంఎంటీటీసీ) పరిసరాల్లో సోమవారం సంస్థ ఉద్యోగులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. గతంలో కురిసిన వర్షాలకు రేకుల షెడ్డుపై విరిగిపడిన చెట్టును తాళ్లతో కట్టి తీశారు. కళాశాల ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.వెంకటరావు, సీతారాం, ప్రసాద్, లక్ష్మణ్, మోహన్ పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో ఏయూ విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న టీమ్ లీడర్లు

వెంకోజీపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత యువజనోత్సవాల్లో ఏయూ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు బహుమతులు సాధించారు. చెన్నై ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో ఏయూ నుంచి 25 మంది విద్యార్థులు 16 విభాగాల్లో పాల్గొన్నారు. రంగోలిలో జి.దీక్షిత మొదటి స్థానం, క్లేమోడలింగ్‌లో డి.గోపి మూడో స్థానం, కార్టూనింగ్‌లో షేక్ రఫీ 4వ స్థానం, స్పాట్ పెయింటింగ్‌లో పి.గిరిప్రసాద్ ఐదో స్థానం,పోస్టర్ మేకింగ్‌లో జి.రేణుక ఐదో స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో ఎ.హేమలత, కె.రేణుక, ఎల్.అశోక్, ఎం.శ్రీను ఐదో స్థానం, మెహందీలో బి.లీలావతి 5వ స్థానం సాధించారు. టీం మేనేజర్లు డాక్టర్ జి.కె.డి.ప్రసాద్, డాక్టర్ పావని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వీసీ ఆచార్య మొత్తమల్ సెల్వం చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

ముగిసిన చెస్ శిక్షణ శిబిరం

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : క్యాండిడ్స్ నైట్స్ చెస్ అకాడమీనిర్వహించిన అంతర్జాతీయ వింటర్ చెస్ శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. శిబిరానికి 53 మంది హాజరయ్యారు. ఔత్సాహికులతో పాటు కామన్‌వెల్త్ అండర్-12 రజత పతకం విజేత అఖిలప్రసాద్, ఫిడే రేటింగ్ విజేతలు జి.రవికృష్ణ, ఎంవీ రుత్విక్ శిక్షణ పొందారు. సింగపూర్‌లో ఉన్నత స్థాయి చెస్ అకాడమీ చీఫ్ ఆర్బిటర్ ఫిడే ట్రైనర్ కేశవానంద కృష్ణ చిత్రాడ శిక్షణ అందించారు. శిక్షణ శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అసిస్టెంట్ క్లాసిక్ ఎండీ డాక్టర్ ఉమధర్ పట్నాయక్, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ మళ్లా సర్వాని, డెర్మటాలజిస్టు డాక్టర్ శ్రీహర్ష, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సిద్ధార్థ బహుమతులు ఇచ్చారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)

● **విడుదల-2:** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)

● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 52, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 40 దొండకాయలు 50, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 60, కీర దోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్ర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు
బ్రాయిలర్

రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

» రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, శ్మశానవాటికలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భూములను స్వాధీనం చేసుకుంటామని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హెచ్చరించారు. పెదవాల్తేరు గాంధీబొమ్మ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్ముందు ప్రభుత్వానికి స్థలాలు, భూముల అవసరం ఉందని, వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజారోగ్యకేంద్రాలు, కల్యాణ మండపాలను నిర్మించాల్సి ఉందన్నారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. భూములు, స్థలాలపై ప్రజా హక్కులను వైసీపీ కాలరాసిందని, ఇళ్ల పట్టాలు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారం చూపించేందుకు వీలుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు పూర్తి హక్కులు ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో సర్వే నంబర్లలోని భూములను రిజిస్ట్రేషన్ కావడం లేదని, అధికారులు వాటిని సరిచేయాలన్నారు. గతంలో 100 గజాల ఉన్నవారికి ఉచితంగా అంతకంటే ఎక్కువ ఉన్న వారికి అతి తక్కువ ధర నిర్ణయించి పట్టాలిచ్చామని గుర్తుచేశారు. ప్రజలు అందించే దరఖాస్తులపై సెల్, ఆధార్ నంబర్లు రాయాలని సూచించారు. సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జిలాని, జోనల్ కమిషనర్ శివప్రసాద్, టీడీపీ నేత చోడే వెంకట పట్టాభిరామ్, కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, గొలగాని మంగవేణి, నొల్లి నూకరత్న, భైరెడ్డి పోతన్నరెడ్డి, తెడ్డు రాజు, పీతల అవినాష్, కాళ్ళ శంకర్, బొట్టా వెంకట రమణ, బీజేపీ నేతలు మురళీమోహన్‌రాజు, బోగిల శ్రీనివాస్, పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు. కాగా సదస్సులో 1,057 దరఖాస్తులు అందాయని రెవెన్యూ అధికారులు తెలిపారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

మద్దిలపాలెంలో హడలెత్తిస్తున్న శునకాలు

» వాహనాలను వెంటాడుతున్న వీధికుక్కలు
» భయంభయంగా పాదచారులు
» నియంత్రణపై దృష్టి పెట్టని అధికారులు

మద్దిలపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా రోడ్లపై తిరుగుతూ వాహనదారులకు పరుగులు పెట్టిస్తున్నాయి. పొరపాటున కుక్క నోటికి పిక్క దొరికిందో చికెన్ ముక్కవడం ఖాయమే. ముఖ్యంగా రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు రోడ్లపై వెళ్లాలంటే హడలిపోతున్నారు. మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ ఏరియాల్లో ఈ శునకాల బెడద తీవ్రంగా ఉంది. గతంలో జీవీఎంసీ అధికారులు కుక్కలను బంధించి నగర శివారు ప్రాంతాల్లో విడిచిపెట్టేవారు. దాదాపు రెండేళ్లుగా వీధికుక్కలను పట్టుకోవడం వంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా వాటి సంతతి పెరిగి రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి. 22వ వార్డులోని పిఠాపురం కాలనీ నుంచి మంగాపురం కాలనీ, పీతలవానిపాలెం, కళాభారతి, శివాజీపాలెం వెళ్లే నాలుగు రహదారులున్నాయి. ఆయా రోడ్లలో రోడ్లల్లో వీధికుక్కలు గుంపులుగా చేరి ద్విచక్రవాహనాదారులపై అరుస్తూ మీద పడుతున్నాయి. పాదచారులను సైతం వెంబడిస్తున్నాయి. మద్దిలపాలెం జాతీయ రహదారి నుంచి ఆర్టీసీ డిపో రోడ్డుల గుండా చైతన్యనగర్, కేఆర్‌ఎంకాలనీ, మద్దిలపాలెం గ్రామంలోకి వెళ్లే వాహనదారులను వీధి కుక్కలు వెంబడిస్తున్నాయి. కొద్దిగా వేగంగా వెళ్లే వాహనాదారులపై అరుస్తూ మీదపడుతున్నాయి. రాత్రి సమయంలో ఈ కుక్కల బెడద మరింత తీవ్రంగా ఉంది. చీకటి పడగానే శునకాలు సందుల్లో ఉంటున్నాయి. వాహనాలు లేదా కురచ దుస్తులు ధరించిన పాదచారులపై దాడులు చేస్తున్నాయి. సెకెండ్ షో సినిమా చూసి ఇళ్లకు వెళ్లేవారు మద్దిలపాలెం, పిఠాపురంకాలనీ రోడ్డుల్లో ప్రయాణాలు చేయడానికి హడలిపోతున్నారు. ఎటునుంచి కుక్కలు వచ్చి దాడి చేస్తాయోనని భయాందోళనలు చెందుతున్నారు. వీటికి తోడు అక్కడక్కడ వీధి దీపాలు వెలగక పోవడంతో స్థానికులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.


మద్దిలపాలెం రోడ్డులో వీధి కుక్కల గుంపు


పిఠాపురంకాలనీ రోడ్డుపై శునకాల హల్‌చల్

ముగిసిన మెప్మా మేళా


మేళాను తిలకించేందుకు వచ్చిన డ్వాక్రా మహిళలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహా నగరపాలక సంస్థ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సంజ్ఞ ఉత్సవ్ (డ్వాక్రా సంఘాలతో మేళా) సోమవారంతో ముగిసింది. నగరపాలక సంస్థ పరిధిలోని డ్వాక్రా సంఘాలతో ఏర్పాటుచేసిన ఈ మేళాకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు భారీగా హాజరయ్యారు. మహిళలు స్వయం సమృద్ధి, ఆర్థిక స్వావలంబన సాధించడానికి కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. వంద స్టాళ్లలో డ్వాక్రా మహిళలే చిరు వ్యాపారాలను ప్రోత్సహించారు. స్టాళ్లకు అద్దె లేకపోవడంతో ఎంత వ్యాపారం జరుగుతుందనే ఆందోళన లేకుండా రంగంలోకి దిగిన మహిళలు ఉత్సాహంగా విక్రయాలు సాగించారు. మేళాలో రెడీమేడ్ వస్త్రాలతో పాటు పండగ సీజన్ కావడంతో లుంగీలు, తువ్వాళ్లు, పంచెలు వంటివి బాగా అమ్ముడయ్యాయి. ఒన్ గ్రామ్ గోల్డ్ ఐటమ్స్, ఆట వస్తువులు, కాస్మొటిక్స్, ఏటికొప్పాక బొమ్మలు, గృహాలంకరణ వస్తువులు, డెకొరేటివ్ ఐటమ్స్, పచ్చళ్లు, తినుబండారాలు వంటి స్టాళ్లలో కూడా విక్రయాలు బాగున్నాయి. మేళా నిర్వహించిన ఆరు రోజులూ తిలకించేందుకు వచ్చిన మహిళలతో మైదానంతో పాటు ఎంవీపీ కూడలి కూడా రద్దీగా మారింది. యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి ఓ ప్రణాళిక ప్రకారం ఆయా సంఘాలు రావాల్సిన సమయాలను ముందుగానే చెప్పడంతో ఒకేసారి వేలాది మంది రాకుండా నియంత్రణ సాధ్యమయింది. మేళా ఆవరణలో ఓ వేదిక ఏర్పాటుచేసి, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ప్రదర్శన మహిళల్లో మంచి ఉత్సాహాన్ని నింపిందని యూసీడీ పీడీ సత్యవేణి అన్నారు. మరోసారి ఇలాంటి ప్రదర్శన ఏర్పాటుచేయాలని, తామూ భాగస్వాములమవుతామని చాలా మంది మహిళలు ముందుకు వస్తున్నారన్నారు. ప్రభుత్వం మహిళలకు వివిధ రంగాల్లో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి మేళా మొదటి మెట్టుగా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి రోజూ పది వేల మందికి పైగా మేళాలో పాల్గొన్నారని వివరించారు.

ముస్లింల సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం నేతలు

మద్దిలపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం విశాఖ నూర్ బాషా ముస్లింల సంక్షేమ సంఘం నేతలు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా షేక్ నాగూర్ మాట్లాడుతూ శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో రంజాన్, బక్రీద్‌లకు ప్రార్థనా స్థలాలు, షాదీఖానాలు నిర్మించాలన్నారు. మేకల కబేళాలు ఏర్పాటు చేయాలన్నారు. వక్ఫ్‌బోర్డు, మైనారిటీ కార్పొరేషన్లకు సొంతభవనాలు నిర్మించాలని, ముస్లిం విద్యార్థులకు ఉర్దూ పాఠశాలలు, నిరుద్యోగులకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన రూ.100 కోట్లు విడుదల చేసి నష్టపోయిన మాంసం విక్రయ వ్యాపారులకు ఆదుకోవాలని కోరారు.

అలరించిన రామయణ పారాయణం


పారాయణం చేస్తున్న రాంబాబు, ఇందిర దంపతులు

మద్దిలపాలెం, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో సోమవారం గుమ్ములూరి రాంబాబు, ఇందిర దంపతులు చేసిన రామాయణ పారాయణం అలరించింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 108 సార్లు వాల్మీకి రామాయణం పారాయణం చేయడం సంతోషంగా ఉందన్నారు. వాల్మీకి విరచిత శ్రీమద్ రామాయణం 24 శ్లోకాలు ఏడుకొండలు, బాలకొండ, అయోధ్యకొండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండలు పారాయణం చేశామన్నారు. ఈ దంపతులను కళాభారతి నిర్వాహకులు సత్కరించారు.

ఐహెచ్‌ఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా పైడిరాజు

సిరిపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా మాదాబత్తుల పైడిరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సిరిపురం బాలాజీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ కార్యవర్గ సమావేశంలో ఐహెచ్‌ఆర్‌సీ ఏపీ స్టేట్ బోర్డు అధ్యక్షుడు ఉమ్మిడి సునీల్ పైడిరాజుకు నియామకపత్రం అందజేశారు. గతంలో పైడిరాజు ఐహెచ్‌ఆర్‌సీ ఉత్తరాంధ్ర రీజియన్ బోర్డు పబ్లిక్ విభాగానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయన మెరుగైన పనితీరును గుర్తించి ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్టు సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె.శివవరుణ్, సభ్యులు పి.లిఖిత, పి.చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


పైడిరాజు

భక్తి శ్రద్ధలతో అమావాస్య పూజలు

వెంకోజీపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో కాలభైరవ స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మకర తోరణం అలంకరించారు. అర్చకులు ప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కర్‌శర్మ అభిషేకాలు, అర్చనలు జరిపారు. డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, కాళ్ల వరహాలు, మద్దాల వీర వెంకట అప్పారావు, బోర ఎర్రాజిరెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

తోటగరువు ఉన్నత పాఠశాలలో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ఆరిలోవ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో ఎనిమిది ఇతివృత్తాలతో 8, 9, పదో తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యక్తిగత, బృంద ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయ సిబ్బంది కేటగిరీలో పలువురు పోటీ పడ్డారు. ఎంపికైన ప్రదర్శనలను శ్రీకృష్ణాపురం ఏపీఎస్‌డబ్ల్యుఆర్ పాఠశాలలో మంగళవారం జరిగే మండల స్థాయి పోటీలలో ప్రదర్శిస్తారని ప్రధానోపాధ్యాయురాలు జీకేడీ భవానీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైన్సు, గణితశాస్త్రంతో పాటు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రూపొందించిన నమూనా ప్రదర్శిస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్‌ఎం భవానీ


స్థానికులనుంచి సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ ఫణిరాం

సూర్యతేజ నగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి : జెడ్సీ

ఆరిలోవ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యల పరిష్కారానికి వీలుగా సూర్యతేజ నగర్ కాలనీలో సోమవారం జెడ్సీ ఫణిరాం, సిబ్బంది పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సంఘ అధ్యక్షుడు డి.నాగరాజు సమస్యలు వివరించారు. ఇంటి పన్నులు వసూలుచేయడంతో పాటు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ శ్రీనివాసరావు, ఏఈ వెంకటరావు, రెవెన్యూ అధికారి శివకుమార్, టీడీపీ నేతలు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు మన్మోహన్‌సింగ్

» వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్


మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రణవ్‌గోపాల్

సిరిపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మన్మోహన్‌సింగ్ గొప్ప దార్శనికుడని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. సిరిపురం వీఎంఆర్డీఏ భవన్‌లో సోమవారం మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి, దేశ ముఖచిత్రాన్ని మార్చేసిన గొప్ప ఆర్థికవేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, శిల్ప, శివాని, భవానీశంకర్, బలరామరాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్‌ఎస్‌కు 89 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 89 వినతులు వచ్చాయని కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. పాత సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. వివిధ జోన్లకు సంబంధించిన పలు విభాగాలపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిని మూడురోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు.

వీఎంఆర్డీఏ ప్రజాదర్బార్‌కు ఏడు వినతులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వివిధ సమస్యలపై వినతులు అందాయి. వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అర్జీలను స్వీకరించారు. పరిపాలన 2, ప్లానింగ్ 4, ఇంజనీరింగ్ 1 మొత్తం 7 అర్జీలు వచ్చాయి. వీటిని వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేశ్, ప్లానింగ్ అధికారులు అరుణవల్లి, చామంతి, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అంధ ఉద్యోగుల సంఘ కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం ఏయూ ఆర్ట్స్ కళాశాలలోని పాలటిక్స్ విభాగంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మళ్ల రమేష్, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాసరావు, ఎస్.ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎల్.నరేష్, కోశాధికారిగా కె.శివకుమార్, మహిళా కార్యదర్శిగా బి.భవాని, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.కల్యాణి, సహాయ కార్యదర్శులుగా వి.నరేష్, కె.పద్మజ, అసోసియేట్ అధ్యక్షునిగా ఆర్.వాసు, అడ్వైజర్‌గా ఎస్.కోటేశ్వరరావు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు, తదితరులు

వెంకోజీపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం ఆవిష్కరించారు. అకడమిక్ సెనేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో క్యాలెండర్, గ్రీటింగ్ కార్డులు ఆవిష్కరించి అధికారులకు బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా సెంటినరీ టవర్, పార్కులను నిర్మిస్తామని తెలిపారు. 2026 జనవరి 26న సెంటినరీ వేడుకల ప్రధాన కార్యక్రమానికి ప్రధాని ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. 2025 ఏప్రిల్ 26 నుంచి ప్రారంభమయ్యే శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏడాది పొడవునా విభిన్న సదస్సులు, వర్క్‌షాప్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ఆచార్య ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్.రాజు, డి.నగరాజకుమారి, జి.గిరిజాశంకర్, ఆర్.పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి క్యాలెండర్లను పంపిణీ చేశారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

సోదరుడి చెంతకు దివ్యాంగురాలు



వరలక్ష్మిని సోదరుడికి అప్పగిస్తున్న కార్యదర్శి వాసు

అక్కయ్యపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న రాజమండ్రికి చెందిన జయపు వరలక్ష్మి (28) అనే దివ్యాంగురాలిని ఆమె సోదరుడు రాకేష్‌కు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. పదేళ్ళ వయస్సు ఉన్నప్పుడు ఆమెకు పోలియో సోకడంతో రెండు కాళ్లు వంకరపోయి నడవలేని స్థితికి చేరుకుందన్నారు. అవిటి దానివని పలువురు పదేపదే అంటుండడంతో తట్టుకోలేక ఇల్లు వదిలి వచ్చేసిందన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఉన్న ఆమెను రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ విభాగం పోలీసులు సమాచారం అందించడంతో ఏయూటీడీ సిబ్బంది వెళ్లి ఇక్కడి షెల్టర్‌కు తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారన్నారు. రాజమండ్రి నుంచి ఆమె సోదరుడు రాకేష్‌కు ఇక్కడికి రావడంతో క్షేమంగా అప్పగించామని ఆయన వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కయ్యపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు సరఫరా నిలిపి వేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ అధికారి బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా తాటిచెట్లపాలెం, తాటిచెట్లపాలెం బజారు, రైల్వే క్వార్టర్స్, రైల్వే ఆక్వా స్పోర్ట్స్ ఏరియా, గవర తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం శివాలయం, తాటిచెట్లపాలెం మసీదు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.

సాంకేతికత వినియోగిస్తే పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ

▸ జాతీయ స్థాయి చర్చా కార్యక్రమంలో వక్తలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ బుద్ద చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ కేవీ రమణ తదితరులు

కంచరపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రసాయన పరిశ్రమలు, ఔషధ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలు, నివారణపై కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో సోమవారం జాతీయ స్థాయి చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిల భారత విద్యా శాఖ మండలి సమన్వయ విద్య మంత్రిత్వ శాఖ ముఖ్య అధికారి డాక్టర్ బుద్ద చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పెరిగిన సాంకేతికతను వినియోగిస్తూ రసాయన పరిశ్రమలు, ఔషధ పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించవచ్చున్నారు. అప్రమత్తతతో పెనుప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చునని సూచించారు. ప్రమాదాల నివారణకు పలువురు సూచనలు, సలహాలను అందజేసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కళాశాల కెమికల్ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి. రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐపీఐ వ్యవస్థాపక డైరెక్టర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్, ఫ్యాక్టరీల జాయింట్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకర్ రెడ్డి, రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అధికార విభాగం ఛైర్మన్ బీఎస్ఎస్ ప్రసాద్, రీజనల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్ రెడ్డితో పాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ వింటర్ చెస్ శిక్షణ

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : క్యాండిడ్స్ నైట్స్ చెస్ అకాడమీ నిర్వహించిన అంతర్జాతీయ వింటర్ చెస్ శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. నగరంలో నాలుగు రోజులపాటు జరిగిన ఈ శిబిరానికి వివిధ ప్రాంతాలకు చెందిన ఆరు నుంచి 60 ఏళ్ల వయసు వారు 53 మంది హాజరయ్యారు. వర్ధమాన ఔత్సాహికులతో పాటు కామన్‌వెల్త్ అండర్-12 రజత పతకం విజేత అఖిలప్రసాద్, ఫిడే రేటింగ్ విజేతలు జి.రవికృష్ణ, ఎంవీ రుత్విక్ వంటి ప్రొఫెషనల్ క్రీడాకారులు సైతం హాజరై శిక్షణ పొందారు. సింగపూర్‌లో ఉన్నత స్థాయి చెస్ అకాడమీ చీఫ్ ఆర్బిటర్, చెస్ క్రీడలో 26 సంవత్సరాల అనుభవం కలిగిన ఫిడే ట్రైనర్ కేశవానంద కృష్ణ చిత్రాడ శిక్షణ అందించారు. మిడిల్ గేమ్ వ్యూహాలు, గేమ్ థియరీ, కాంబినేషన్లు, లోతైన విశ్లేషణతో పాటు ఓపెనింగ్‌లో పాటించాల్సిన ప్రామానికత వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అసిస్టెంట్ క్లానిక్ ఎండీ డాక్టర్ ఉమధర్ పట్నాయక్, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ మళ్లా సర్వాని, డెర్మటాలజిస్టు డాక్టర్ శ్రీహర్ష, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సిద్ధార్థ బహుమతులు అందజేసి అభినందించారు.

సమాంతర సినిమాల దార్శనికుడు బెనగల్

▸ సంస్మరణ సభలో కీర్తించిన వక్తలు



బెనగల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు, అతిథులు

సీతంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాంతర సినిమాల దార్శనికుడు శ్యామ్ బెనగల్ అని పలువురు వక్తలు కొనియాడారు. ద్వారకానగర్‌లో గల పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం బెనగల్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాను నమ్మిన యాదార్థ, వ్యదార్థ కథల్ని ఎక్కడా రాజీపడకుండా సమాంతర సినిమాగా బెనగల్ తెరకెక్కించేవారన్నారు. బెనగల్‌కు ప్రభుత్వం పద్మశ్రీ ద్వారా గౌరవించాలని కోరారు. అనంతరం శ్యామ్ బెనగల్ దర్శకుడుగా వాణిశ్రీ గిరిజన మహిళగా నటించిన 'అనుగ్రహం' తెలుగు సినిమాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కార్యదర్శి నరవ ప్రకాశరావు, కార్యనిర్వాహక కార్యదర్శి బి.చిన్నారావు, హిమ, డాక్టర్ గాయత్రి, సుబ్బారావు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు.

స్టీల్‌ప్లాంటుకు కూటమి సాయం

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా దానిని కాపాడతామని ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కార్మికులకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఢిల్లీ పెద్దలతో కూటమి నేతలు మాట్లాడి రెండు విడతలుగా రూ.1,650 కోట్ల ఆర్థిక సాయం అందించారు. భారీ ప్యాకేజీ కోసం మంతనాలు జరుపుతున్నారు. మరోవైపు స్టీల్‌ప్లాంటు వీఆర్ఎస్ కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. సీఎండీ అతుల్‌భట్‌ను పదవీకాలం పూర్తికాక ముందే దీర్ఘకాలిక సెలవులో పంపించింది. శక్తిమణిని సీఎండీగా ఎంపిక చేయగా, ఆయన్ను కాదని ఎంఐఎల్ నుంచి సక్సేనాను తీసుకువచ్చారు. హెచ్‌బీ కాలనీలో స్టీల్‌ప్లాంటు భూములను యాజమాన్యం విక్రయించాలని యత్నించగా హైకోర్టు ఏప్రిల్ 25న స్టే విధించింది.

డీప్ టెక్నాలజీపై సీఎం సదస్సు

సీఎం చంద్రబాబునాయుడు డిసెంబరు 6వ తేదీన నోవాటెల్‌లో డీప్ టెక్నాలజీపై సదస్సు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి టెక్నాలజీ రంగంలో వస్తున్న నూతన పోకడలను ఆయన తెలుసుకున్నారు.

- విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సెప్టెంబరులో దాడులు నిర్వహించి మనీ ల్యాండరింగ్‌కు సంబంధించి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు శివాజీపాలెంలోని ఆయనకు చెందిన భవనంలో వ్యభిచారం జరుగుతున్నట్టు పోలీసులు కేసు పెట్టారు.

పదవులు...బాధ్యతలు

మిజోరాం గవర్నర్‌గా ఉన్న కంభంపాటి హరిబాబును కేంద్రం ఒడిశా గవర్నర్‌గా నియమించింది. గిరిజన సహకార సంస్థ ఛైర్మన్‌గా కిడారి శ్రావణ్‌కుమార్ నవంబరు 18న, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్‌గా ప్రణవ్‌గోపాల్ నవంబరు 25న బాధ్యతలు చేపట్టారు. జూన్ 14న పల్లా శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు.

- విశాఖకు డ్రగ్స్‌తో వచ్చిన కంటెయినర్‌ని సీబీఐ అధికారులు మార్చి నెలాఖరును సీజ్ చేశారు.ఆ తరువాత దానిపై విచారణ చేసి దొరికినవి డ్రగ్స్ కాదని డిసెంబరులో కేసును మూసివేశారు.

దిద్దుబాటు చర్యలు

శారదా పీఠానికి భీమిలి సమీపాన కేటాయించిన 15 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 19న రద్దు చేసి వెనక్కి తీసుకుంది.భీమిలి బీచ్‌లో సాయిరెడ్డి కుమార్తె నేహా రెడ్డి అక్రమంగా నిర్మాణాలు చేపడుతుండగా వాటిని హైకోర్టు ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు కూలగొట్టారు. ఎండాడ హయగ్రీవ ప్రాజెక్టులో నిబంధనలు ఉల్లంఘించారని సీసీఎల్‌ఏ అనుమతులు రద్దు చేసింది. విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణకు స్పీకర్ సభా సంఘాన్ని వేయగా ఆ కమిటీ విచారణ ప్రారంభించింది.

సంబరాలకు వేళాయె

... 5వ పేజీ తరువాయి

డీజే, సింగర్ కారుణ్య లైవ్ ప్రోగ్రామ్, నోవాటెల్‌లో 'రోరింగ్ ట్వంటీస్', ఫోర్ పాయింట్స్ షెరటాన్ హోటల్‌లో 'టోబో వుడ్' పేర్లతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు బీచ్‌రోడ్డు లోని ప్రముఖ హోటళ్లు, రిసార్ట్సులో నూత న సంవత్సర వేడుకలను గ్రాండ్‌గా నిర్వ హించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సింగిల్, కపుల్స్‌కు ఎంట్రీ పాస్‌లు విక్రయి స్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతోపాటు కొన్ని కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగు లకు ప్రత్యేక పాస్‌లను కొనుగోలు చేసి నట్టు తెలిసింది. అదేవిధంగా పలు అపా ర్టుమెంట్‌లు, గ్రూపు హౌస్‌లలో డిన్నర్‌తో పాటు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, గేమ్స్ వంటివి నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

స్వల్పంగా పెరిగారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గత నెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. ఆ ప్రక్రియ ముగియడంతో సోమవారం ఎన్నికల అధికారి తుది జాబితా విడుదల చేశారు. గత నెల 23న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 15,297 మంది ఓటర్లు ఉండగా అభ్యంతరాలు స్వీకరించడంతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు.ఈ సందర్భంగా 19 మంది ఓటర్లపై అభ్యంతరాలు రాగా వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు.కొత్తగా పురుషులు 3,325, మహిళలు 2,962 మంది వెరసి 6,287 మంది దరఖాస్తు చేయగా పరిశీలించి అందరినీ జాబితాలో చేర్చారు. వచ్చే ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తరువాత మరోసారి ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వనున్నది.

ముగిసిన రాష్ట్రస్థాయి ట్రయిథ్లాన్ పోటీలు

▸ విజేతలకు పతకాలు



పతకాలు పొందిన విజేతలు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ట్రయిథ్లాన్ సంఘం నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ ట్రయిథ్లాన్ చాంపియన్‌షిప్ పోటీల్లో సీహెచ్.శేఖర్, కె.వంశీకృష్ణ, డాక్టర్ కె.కృష్ణ చైతన్య ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. వివిధ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో 750మీ. స్విమ్మింగ్, బీచ్ రోడ్డులో 20.కి.మీ సైక్లింగ్, 5కి.మీ పరుగు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. ఈ పోటీల ముగింపోత్సవానికి బీఏఎస్ కిరణ్‌కిషోర్, సిహెచ్.అప్పలరాజు, సిహెచ్.నాగేశ్వరరావు అతిథులుగా హాజరై తొలి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు మంచి అవకాశాలు'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

సీతంపేట, డిసెంబరు 30, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి (ఏపీఎన్‌పీఎస్) ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఇక్కడి రాజేంద్రనగర్‌లో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ద్వారా రానున్న రోజుల్లో మంచి అవకాశాలు ఉంటాయని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరించినందుకు తగిన మూల్యం చెల్లించిందన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ పోరాట సమితి కార్యదర్శి టి.సూర్యం, ఉత్తరాంధ్ర కన్వీనర్ కె.శ్రీనివాసరావు, ప్రొఫెసర్ నాగరాజు, మణికంఠ, జనసేన నాయకులు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, బి.సునీల్, నారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలను నియంత్రించాం

... 5వ పేజీ తరువాయి

పెరిగిందన్నారు. తాము తీసుకున్న చర్యల కారణంగా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించలిగామన్నారు. 2022లో 1,353, 2023లో 1,180 ప్రమాదాలు జరిగితే, ఈ ఏడాది 1,094కి తగ్గాయన్నారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా గత ఏడాది 1,44,907 కేసులు నమోదుచేసి రూ.16.22 కోట్లు జరిమానా విధిస్తే, ఈ ఏడాది 1,63,913 కేసులు నమోదుచేసి రూ.25.67 కోట్లు జరిమానా విధించామన్నారు. రోడ్డు ట్రాఫిక్ ఇంజనీరింగ్ పేరుతో 35 కూడళ్లను అభివృద్ధి చేయడంతోపాటు రాత్రిపూట లైటింగ్ పెంచామన్నారు. గంజాయి రవాణాదారులు, స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపామన్నారు. గత ఏడాది ఎన్‌డీపీఎస్ కింద 235 కేసులు నమోదు చేసి 704 మందిని అరెస్టు చేసి 4,700 కిలోల గంజాయిని సీజ్ చేస్తే, ఈ ఏడాది 313 కేసులు నమోదుచేసి 718 మందిని అరెస్టు చేసి 5,024 కిలోల గంజాయితోపాటు, 132 గంజాయి చాక్లెట్లను సీజ్ చేశామన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు విరివిగా అవగాహన కల్పించడంతో కేసుల సంఖ్య ఈ ఏడాది కాస్త తగ్గిందన్నారు. 2022లో 613 కేసులు, 2023లో 419 కేసులు నమోదైతే ఈ ఏడాది 364కి తగ్గినట్టు చెప్పారు. సైబర్ నేరగాళ్లు ఉపయోగించిన 2520 బ్యాంకు ఖాతాల్లో రూ.20.42 కోట్లు ఫ్రీజ్ చేసి, రూ.రెండు కోట్లు బాధితులకు అందజేశామన్నారు. నగరంలో తరచూ అల్లర్లు, దాడులు, హత్యలకు పాల్పడడం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిని గుర్తించి షీట్‌లు తెరిచామన్నారు. ఈ ఏడాది 175 మందిపై సస్పెక్ట్ షీట్లు, 176 మందిపై రౌడీ షీట్లు తెరిచామన్నారు. మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, లైంగిక దాడులకు పాల్పడుతున్న 35 మందిపై రాష్ట్రంలోనే మొదటిసారిగా పియాడియోఫిల్ షీట్‌లు తెరిచామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న 35 మందిపై డ్రగ్ అఫెండర్ షీట్, భూకబ్జాలకు పాల్పడుతున్న ముగ్గురిపై లాండ్ గ్రాబర్‌షీట్, సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఒకరిపై సైబర్ బుల్లీ షీట్ తెరిచామన్నారు. చోరీ కేసుల్లో రికవరీ చేసిన సొత్తును కోర్టు అనుమతితో 'క్రైమ్ ప్రాపర్టీ మేళా' నిర్వహించి బాధితులకు వెంటనే అందజేస్తున్నామన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా హోంగార్డు నుంచి ఉన్నతాధికారుల వరకూ అందరికీ ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించబోతున్నామన్నారు. ప్రజలకు పోలీస్ సహాయం అవసరమైనప్పుడు కిందిస్థాయి పోలీసులు స్పందన సరిగా లేదనిపిస్తే నేరుగా తనను ఫోన్‌లో సంప్రతించేలా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సీపీ హెల్ప్‌లైన్ పేరుతో మొబైల్ నంబర్ అందుబాటులోకి తెచ్చానన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, క్రైమ్ డీసీపీ లతామాదురి, స్పెషల్ బ్రాంచి డీసీపీ పి.శ్రీనివాసరావు, క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు నరవ ప్రకాశరావుకు ఆహ్వానం

డాబాగార్డెన్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ మూడో జాతీయ సదస్సుకు నగరానికి చెందిన నరవ ప్రకాశరావుకు ఆహ్వానం అందింది. వచ్చేనెల 4, 5 తేదీల్లో ఒడిశాలోని పూరీలో ఉన్న ఇసూమంతు ఆశ్రమం ఆవరణలో ఈ సదస్సు జరగనుంది. దేశంలో అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొనే ఈ సమావేశంలో జాతీయ విద్యా విధానం, విద్య ప్రైవేటీకరణ, విద్యా రుసుము పెంపుదల, విద్యా బోధన, తదితర అంశాలపై చర్చించనున్నారు.

ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంటు వద్దు : సీటూ

జగదాంబ కూడలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్సెలార్ స్టీల్‌ప్లాంటు ఏర్పాటు వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. సోమవారం ఆయన సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్సెలాల్ స్టీల్‌ప్లాంటును నువేంపాడు టోల్ గేట్ నుంచి రాజయ్యపేటలో పెట్టడం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందన్నారు. నక్కపల్లి ప్రాంతం కాలుష్య పరిస్థితులపై 2000లోనే పర్యావరణ నిపుణుల కమిటీ ఈ విషయాన్ని వెల్లడించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్సెలార్ స్టీల్‌ప్లాంటు నిర్మాణానికి ముందుకు రావడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంటును నాశనం చేసే దిశగా కూటమి, కేంద్రంలోని మోదీ పావులు కదుపుతున్నారన్నారని దుయ్యబట్టారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంటుతో విశాఖ స్టీల్ అమ్మకాలకు దెబ్బతీయాలన్న ఆలోచనలో ఉన్నారని విమర్శించారు. ఈమేరకు 8న నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు సీటూ నాయకుడు కుమార్ ఉన్నారు.

ఆస్తి పన్ను వసూలు



డీసీఆర్‌కు చెక్కును అందజేస్తున్న జడ్సీ, రెవెన్యూ అధికారులు

జ్ఞానాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జోన్-5 పరిధిలో రెవెన్యూ అధికారులు సోమవారం భారీగా ఆస్తి పన్ను వసూలు చేశారు. 43వ వార్డులో ఉన్న ఎస్సార్ కంపెనీ నుంచి రూ. 69. 55 లక్షలు వసూలు చేసి ఆ చెక్కును జీవీఎంసీ డీసీఆర్ ఎస్. శ్రీనివాసరావుకు జడ్సీ బి. రాము అందజేశారు. మరిన్ని మొండి బకాయిలు కూడా వసూలు చేయాలని డీసీఆర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఓ రాజ్యలక్ష్మి, ఆర్ఐ శ్రీనివాస్, వార్డు అడ్మిన్ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

ముగిసిన మార్గశిర మాసోత్సవాలు

కనక మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అఖండ దీపారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఈవో శోభారాణి

జగదాంబ కూడలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మార్గశిర మాసోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా నెల రోజుల పాటు అమ్మవారిని లక్షలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, తెలంగాణ ప్రాంతానికి చెందిన పలువురు తరలివచ్చారు. ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని ఆలయంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. అంతకముందు తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈవో కె. శోభారాణి, ఆలయ ఏఈ రమణ ఏర్పాట్లు చేపట్టారు. కాగా ఉత్సవాల ముగింపు పురస్కరించుకొని రాత్రి ఆలయంలో అఖండ దీపారాధన చేపట్టారు. అమ్మవారి ముఖ చిత్రాన్ని మండప ప్రాంగణంలో తీర్చిదిద్ది దీపారాధన చేశారు.దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ దీపారాధనలో పాల్గొని, అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వన్‌టౌన్ సీఐ దేముడుబాబు, పోలీసు సిబ్బందిని, ఆలయ సిబ్బందిని, అమ్మవారి సేవలో పాల్గొన్న శానిటేషన్ సిబ్బందిని ఈవో సత్కరించారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి : వామపక్షాలు



నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

డాబాగార్డెన్స్ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. తక్షణమే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను సమర్థించిన దేశ ప్రధాని నరేంద్ర మోదీపై పోలీసులు కేసులు బనాయించకుండా వామపక్ష పార్టీల కార్యకర్తలపై విరుచుకుపడడం సరైంది కాదన్నారు. అంబేడ్కర్‌ను కూడా అవమానిస్తే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని, మనువాద సిద్ధాంతం వద్దని రాజ్యాంగాన్ని రక్షించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, సీపీఎం సభ్యులు పి. మణి, వై. కొండయ్య, గోవిందరాజులు, వి. కృష్ణారావు, చంద్రశేఖర్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, రాజు, లక్ష్మి, వెంకటరావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం

అల్లిపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వచ్చే నెల 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నామని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గంలోని వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులు పాలిథిన్ కవర్లకు బదులు గుడ్డ సంచులు వాడేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్‌ఓ కృష్ణంరాజు, ఎస్ఎస్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జడ్సీ మల్లయ్యనాయుడు

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అల్లిపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే వినతులను అధికారులు సకాలంలో పరిష్కరించాలని జోన్-4 జడ్సీ ఎం. మల్లయ్యనాయుడు అధికారులను ఆదేశించారు.సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అనంతరం ప్రజల నుంచి మూడు ఫిర్యాదులు స్వీకరించారు. అలాగే జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జడ్సీ రాము నాలుగు అర్జీలు తీసుకున్నారు. పట్టణ ప్రణాళికా విభాగానికి 2, రెవెన్యూ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్‌కు 1 అర్జీ స్వీకరించారు. కార్యక్రమంలో ఈఈ తార ప్రసన్న, సూపరింటెండెంట్ టీఎస్ఎన్ రాజు, రమణ, ఏఎంహెచ్‌ఓ సునీల్‌కుమార్, టీపీఓ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై మైక్‌లు ఏర్పాటు

సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై, కొండ దిగువన అను నిత్యం అప్పన్న నామస్మరణ ప్రతిధ్వనించేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశించారు. ఈమేరకు దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈ సన్యాసిరావు పర్యవేక్షణలో ఘాట్ రోడ్డులో, మెట్ల మార్గంలో ఇప్పటికే ఉన్న బ్రాడ్ కాస్టింగ్ సిస్టమ్‌కు మరమ్మతులు చేపట్టడంతో పాటు నూతనంగా రూ. 8 లక్షలతో మైక్‌లు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజులుగా సిబ్బంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు భక్తులకు వినిపించే దేవుడి గీతాల ప్రసారాన్ని పూర్తిగా నిలిపివేసి 'ఓం నమో నారసింహా' అన్న నామం నిరంతరం ప్రసారం చేయనున్నట్టు అధికారులు తెలిపారు.



మైక్‌లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. నవంబరు నెల జీతం ఇప్పటివరకూ ఇవ్వలేదు. ఇక కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి అయితే చెప్పాల్సిన పనిలేదు. కొన్ని విభాగాల్లో అయితే ఆరేడు నెలలు, మరికొన్ని విభాగాల్లో అయితే నాలుగు నెలల నుంచి జీతాలు చెల్లించలేదు. జీతం బకాయిలు కనీసం సంక్రాంతి పండుగ ముందైనా చెల్లించాల్సిందిగా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు.

గోల్డెన్ ఈగల్‌పై స్టార్ ఫ్లెక్స్ గెలుపు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఫుట్‌బాల్ టోర్నీ తొలిరోజు మ్యాచ్‌లో స్టార్ ఫ్లెక్సు 4-0 గోల్స్ తేడాతో గోల్డెన్ ఈగల్‌పై విజయం సాధించింది. మ్యాచ్ ఆద్యంతం స్టార్ ఫ్లెక్సు ఆటగాళ్లు ఆధిపత్యం ప్రదర్శించి సునాయాస విజయాన్నందుకున్నారు. అంతకుముందు ఏయూ, మహ్మడన్ స్పోర్టింగ్ క్లబ్ మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది.

అపరిశుభ్రమైన నీటితో అవస్థలు



బురదమయంగా ఉన్న కుళాయి నీరు

మురళీనగర్, డిసెంబరు 30 : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారుతోంది. కాలనీల్లో సరఫరా అవుతున్న నీరు పరిశుభ్రత రోజురోజుకీ తీసికట్టుగా ఉంటోందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. జీవీఎంసీ 49వ వార్డు బర్మాక్యాంపు పరిసరాలు, 50, 51 వార్డుల పరిధిలోని మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో జీవీఎంసీ ట్యాంకుల నుంచి సరఫరా అవుతున్న నీరు పూర్తిశుద్ధి చేయకుండానే వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మాధవధార ఉడా కాలనీ ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో 24 గంటల నీటి సరఫరా పైపుల నుంచి ఎర్రటి రంగులో బురదను తలపించేలా నీరు సరఫరా అయ్యింది.

ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రైల్వే వంతెనను విస్తరించాలని 'పల్లా'కు వినతి

అగనంపూడి, డిసెంబరు 30: జీవీఎంసీ 85వ వార్డు పరిధి తలారివానిపాలెం రైల్వే ట్రాక్ వద్ద గల వంతెనను విస్తరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును స్థానిక నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. వంతెన ఇరుకుగా ఉండడం వల్ల ఆటోలు, కార్లు ఇటుగా వెళ్లలేని పరిస్థితి నెలకొందని, ఈ కారణంగా అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజలు మంగళపాలెం, వెదుళ్లనరవ, నంగినారపాడు గ్రామాలకు వెళ్లాలంటే దువ్వాడ రైల్వే స్టేషన్ మీదగా వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వంతెనను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. పల్లాను కలిసిన వారిలో జనసేన వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్, నాయకులు మోటూరి వెంకటరమణ, బి.సత్యనారాయణ, కోసూరి తాతారావు, చందు రమేశ్, డీవీ అప్పారావు, తదితరులు ఉన్నారు.

కుల గణన ఆడిట్‌ను పొడిగించాలి

మల్కాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో భాగంగా చేపట్టనున్న కుల గణన ఆడిట్‌ను మరో రెండు వారాల పాటు పొడిగించాలని కోరుతూ జై గౌతమ్ బాబా రెల్లి సేవా సంఘం, పారిశ్రామిక ప్రాంతంలోని 13 వీధుల రెల్లి సంఘాల ప్రతినిధులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా దళితులందరికీ సమ న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌతమ్ బాబా రెల్లి సేవా సంఘం అధ్యక్షుడు సింగంపల్లి కల్యాణ ముని, జిల్లా పారిశ్రామిక ప్రాంత రెల్లి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కొట్నాన రవి, ఐదు రెల్లి వీధుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు దశమంతుల చిన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శ్రీనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు సుందరయ్య కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పి.సీ తారాములు కుటుంబానికి సోమవారం పద్మశాలీ సేవా సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కన్వీనర్ పప్పు రాజారావు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పేద చేనేత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సతీశ్, అప్పారావు, రాజు, లక్ష్మణరావు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్, మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌లు ఎంతగానో దోహదపడతాయని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సైన్స్, మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనా ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)

● **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)

● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 52, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 40 దొండకాయలు 50, బంగాళ దుంపలు 26, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 60, కీరదోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

కనుమరుగవుతున్న గ్రీటింగ్ కార్డులు

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంతో తీపి గురుతులకు తగ్గిన ఆదరణ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వస్తుందంటే చాలు.. ఒకప్పుడు మనకెంతో ఇష్టమైన వారికి, ఆప్తులు, కుటుంబ సభ్యులకు అందమైన గ్రీటింగ్ కార్డులకు ఇవ్వాలని వారం, పది రోజుల ముందు నుంచే షాపుల చుట్టూ తిరిగేవాళ్లం. న్యూ ఇయర్‌కు మనకు ఎవరెవరు గ్రీటింగ్ కార్డులు ఇస్తారు, ఎవరెవరూ పోస్టుల్లో పంపుతారో ముందస్తుగానే ఊహించి వారి కోసం కార్డులు కొనేందుకు ఉత్సాహం చూపేవాళ్లం. ఇప్పుడు రోజులు మారాయి.. సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంతో గ్రీటింగ్ కార్డులు కొని.. పంపించే సంస్కృతి రానురాను కనుమరుగైపోతోంది. అరచేతిలో ఉన్న మొబైల్ ఫోన్ ద్వారానో, కంప్యూటర్ ద్వారానో వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, ట్విట్టర్, ఈ-మెయిల్స్ వంటి ద్వారా మనకు నచ్చిన కార్డులను.. మనసుకు హత్తుకునే సందేశాలతో కూడిన గ్రీటింగ్‌లను మన స్నేహితులకు, బంధువులకు, ఆత్మీయులకు పంపడం ఆనవాయితీగా మారింది. డబ్బులతో పనిలేకుండా ఎంచక్కా ఉచితంగానే మెసేజ్‌లతోనో, వీడియో రూపంలోనే న్యూ ఇయర్ విషెస్, సంక్రాంతి, పుట్టినరోజు, పెళ్లిరోజు శుభాకాంక్షలు చెప్పడం అందరికీ అలావాటైపోయింది. అయితే టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా అప్పటి మాదిరిగా స్వహస్తాలతో మనల్ని సంబోధిస్తూ మనకు శుభాకాంక్షలు చెబుతూ అందే గ్రీటింగ్ కార్డులు అందితే ఆ ఆనందమే వేరుకదా.. అప్పట్లో



అలా స్నేహితులు, కుటుంబీకులు, ఆత్మీయుల నుంచి అందుకునే కార్డులను ఎంతో భద్రంగా దాచుకుని, అప్పుడప్పుడు చూసుకుని మురిసిపోయేవాళ్లమని పలువురు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు.

1995 నుంచి గ్రీటింగ్ కార్డులకు తగ్గిన ఆదరణ

గ్రీటింగ్ కార్డులకు ఆదరణ తగ్గిందనే చెప్పాలి. 1995 సంవత్సరం తర్వాత సెల్ ఫోన్ల వినియోగం బాగా పెరిగింది. అప్పటినుంచే శుభాకాంక్షలు, అభినందనలు చెప్పుకునే విధానం పూర్తిగా మారిపోయింది. అంతా డిజిటల్ మయమైపోయింది. దీంతో గ్రీటింగ్ కార్డులకు ఆదరణ తగ్గింది. ఇప్పుడు కేవలం కొంత మంది పాఠశాలల విద్యార్థులు మాత్రమే గ్రీటింగ్ కార్డుల ద్వారా శుభాకాంక్షలు చెప్పడం కనిపిస్తుంది.

గొప్ప అనుభూతికి దూరమయ్యాం

-బీఎస్ రాజు, ఉక్కు ఉద్యోగి



అప్పట్లో కొత్త సంవత్సరం వస్తుందంటే చాలు నాలుగైదు రోజుల ముందు నుంచే ఎంతో ఆనందంగా ఉండేది. స్నేహితులందరం కలిసే వారం. ఒకరికొకరు గ్రీటింగ్ కార్డులు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పుకుని సరదాగా గడిపేవాళ్లం. కానీ ఇప్పుడు వాటన్నింటికీ దూరమయ్యాం. అందరకం ఫోన్‌లోనే శుభాకాంక్షలు చెప్పుకుంటున్నాం. టెక్నాలజీ అందిపుచ్చుకోవడం చాలా ఆనందంగా ఉన్నా చిన్న చిన్న ఆనందాలకు దూరమవుతున్నామనే బాధ మాత్రం వెంటాడుతోంది.



గ్రీటింగ్ కార్డు చరిత్ర..

పురాతన కాలంలో చైనాలో శుభాకాంక్షలు చెప్పుకునే సంస్కృతి ఉండేది. ఎన్నో ఏళ్ల క్రితం యూరప్‌లో తయారు చేసిన కార్డుల ద్వారా శుభాకాంక్షలు చెప్పుకునేవారు. జర్మన్‌లు మొదట చెక్కతో తయారుచేసిన గ్రీటింగ్‌లు ఉపయోగిస్తే.. యూరోపియన్లు చేతితో తయారుచేసిన గ్రీటింగ్‌లను ఉపయోగించేవారు. అలా మొదలైన గ్రీటింగ్ కార్డుల సంస్కృతి రానురాను మారిపోతుంది.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి: తహసీల్దార్ శ్రీవల్లి

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వార్డుల పరిధిలో గల రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి కోరారు. 68వ వార్డు మిందిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలతో పాటు ఇతర సమస్యలను కూడా ప్రజలు ఈ సదస్సులో తమకు ఫిర్యాదు చేస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతు ప్రజల సమస్యలతో పాటు వార్డులో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కూడా ఈ సదస్సులు ఉపయోగపడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఈటి శ్యామలరావు, అప్పలరాజు, శ్రీను, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



చింతగట్లలో జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

చింతగట్లలో 67 అర్జీలు స్వీకరణ

పెందుర్తి: మండలంలోని చింతగట్లలో సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మీ కనకరాజు ఆధ్వర్యంలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటలక్ష్మి రెవెన్యూ సదస్సుల ప్రాధాన్యాన్ని వివరించారు. భూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్ 67 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, ఉప సర్పంచ్ బి.సంతోశ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ గొలగాని అప్పారావు, తదితరులు పాల్గొన్నారు



సత్కరించిన కార్యకర్తలతో నల్లూరు సూర్యనారాయణ

టీడీపీలోనే కార్యకర్తలకు గౌరవం

86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గ పరిధి 86వ వార్డులో ఐదు వేల మందితో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉందని టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లో మంగళవారం అధిక సభ్యత్వ నమోదుకు కృషి చేసిన కార్యకర్తలను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నల్లూరు మాట్లాడుతూ శ్రమించే కార్యకర్తలకు టీడీపీలో మాత్రమే తగిన గౌరవం, ఆదరణ లభిస్తుందన్నారు. సభ్యత్వ నమోదులో కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని కోరారు. రూ.వంద సభ్యత్వ నమోదుతో కార్యకర్తతో పాటు కుటుంబానికి భరోసా, భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, గణపతి, వెంకటసుబ్బయ్య, నాగార్జున, జగదీశ్, లోవరాజు, అప్పారావు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 ఫిర్యాదులు

వేపగుంట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఐదు ఫిర్యాదులు అందాయి. ఇందులో 93వ వార్డు శ్రీనివాసనగర్‌లో రోడ్డుపై ఏర్పాటు చేసిన టీకొట్టు వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, 94వ వార్డు గౌతమ్ నగర్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టాలని, 96వ వార్డు పెందుర్తి సమీపంలోని ఎల్ఐసీ కాలనీలో విద్యుత్ స్తంభం కారణంగా రోడ్డు నిర్మాణానికి తలెత్తిన ఇబ్బందులను తొలగించాలని, 98వ వార్డు సింహపురి లేఅవుట్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, తదితర ఫిర్యాదులు అందాయి. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి తగిన చర్యలు చేపడతామని జెడ్సీ కె.హైమావతి పేర్కొన్నారు.

నిరాశ్రయులకు వైజాగ్ హెల్పింగ్ హ్యాండ్స్ వితరణ

పెందుర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెందుర్తికి చెందిన వైజాగ్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఎస్‌టీఎల్ వద్ద గల నిరాశ్రయుల ఆశ్రమానికి నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా నిరాశ్రయులతో కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్ చేయించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మమత, సంస్థ ప్రతినిధులు నరేశ్, శ్యామ్, అశోక్, ఫిరోజ్‌ఖాన్, మురళీ, రమణ, జీకె నాయుడు, శివ, తదితరులు పాల్గొన్నారు.



భారీ వృక్షాలను నరికివేసిన దృశ్యం

అగ్రిగోల్డ్ స్థలాల్లో చెట్లను నరికేస్తున్నారు

కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు

మల్కాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యారాడ అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంపై సీఐడీ దర్యాప్తు జరుగుతున్నప్పటికీ ఇద్దరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వృక్షాలను నరికించి టింబర్ డిపోకు తరలించినట్టు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా నేరేడు, రావి, మర్రిచెట్లను నరికి విక్రయాలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. అంతేకా ఈ ప్రదేశంలో ఫొటో షూట్‌లకు అవకాశం కల్పిస్తూ పెద్దఎత్తున నగదు వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెట్ల నరికివేతపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలపై కార్పొరేటర్ సమీక్ష

పెందుర్తి-రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం, గవరపాలెం కాలనీలకు సంబంధించిన 501 నంబర్ సచివాలయాన్ని సోమవారం 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార అంశాలపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ 95, 97 వార్డుల అధ్యక్షుడు చిక్కాల సతీశ్, యువమోర్చ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ ఉప సర్పంచ్ సీహెచ్ రమణ, నాయకులు శంకర్, ప్రసాద్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

98వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

వేపగుంట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని అప్పన్నపాలెం పంచాయతీ కాలనీ, సిద్ధిలక్ష్మీ నగర్, శ్రీలక్ష్మీనరసింహ నగర్ పరిసరాల్లో రహదారి నిర్మాణం చేపట్టాల్సినప్రాంతాలను కార్పొరేటర్ పి.వి.నరసింహం సోమవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం ఏ విధంగా జరుగుతుందో వివరించారు. గతంలో ఆయా రహదారి పనులు సగంలో నిలిచిపోయాయని, దీంతో మళ్లీ రూ.11 లక్షల నిధులు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలి

మల్కాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జనవరి ఐదున విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావ మహాసభలో అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆర్ఎస్ఎస్ సభ్యులు ప్రచారం సాగిస్తు న్నారు. ఇందులో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలువురు నాయకులను కలిసి ఆహ్వాన పత్రాలను అందజేస్తున్నారు. సోమవారం వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహన్‌నాయుడును ఆర్ఎస్ఎస్ సభ్యులు, బీజేపీ నాయకులు కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోలిమేర శ్రీను, గురుమూర్తి, జి.సతీశ్‌యాదవ్, ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

మల్కాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పలు పోటీల విజేతలకు సంస్థ సీఎండీ డి.హేమంత్ కత్రి, డైరెక్టర్ కమాడోర్ రాకేశ్ బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, క్రీడల్లో రాణించేవారు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటారన్నారు. కార్మిక నాయకులు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ కొనుగోలు విషయంలో తప్పు చేసిన వైసీపీ'

గాజువాక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు విషయంలో చేయరాని తప్పు చేసిందని టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మండిపడ్డారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బాకీ పడిన నగదు విషయంలోనూ లేనిపోని రాద్ధాతాలు చేస్తుందని విమర్శించారు. సమావేశంలో నాయకులు టి.శివప్రసాద్, డి.సత్యారావు, కూన వెంకటరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న న్యాయవాది

గాజువాక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది కటారి సునీత సోమవారం తెలుగుదేశం పార్టీ జీవితకాల సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి లక్ష రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందారు. ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పల్లా ఆమెకు విజ్ఞప్తి చేశారు.



'పల్లా' నుంచి సభ్యత్వం స్వీకరిస్తున్న సునీత

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: 'పల్లా'

ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని టీడీపీ, రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 67వ వార్డులో రూ.67 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నామన్నారు. కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.రంగా యాదవ్, కె.సింహాచలం, వెంకటరావు, రాము, శంకరరావు పాల్గొన్నారు.

63వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింధియా, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డులో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) అన్నారు. సోమవారం ఆయన వార్డు పరిధిలోని జై ఆంధ్రా కాలనీలో బీటీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. వార్డులోని సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గుడేల కృష్ణ, జెర్రిపోతుల నరసింగరావు, బొండా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై సీపీఐ అలుపెరుగని పోరాటం'

పెదగంట్యాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక, బడుగు వర్గాల సమస్యలపై సీపీఐ అలుపెరుగని పోరాటం చేస్తుందని పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు, 72వ వార్డు కార్పొరేటర్ ఏజే స్టాలిన్ అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐకు కార్యకర్తలే వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆరు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నేత వై.దేముళ్లను సత్కరించారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యనారాయణ, నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, తాండ్ర కనకరాజు, పి.పోలయ్య ఎ.విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభ్యుదయ సంఘం నూతన కార్యవర్గం

ఆర్పీపేట,(కంచరపాలెం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వార్డు పరిధి గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మళ్ల రాంప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కాళ్ల రామ గోవింద్, కార్యదర్శిగా మళ్ల రమేశ్ గౌరి, సహాయ కార్యదర్శిగా మళ్ల అనిల్‌కుమార్, కోశాధికారిగా కె.సత్యనారాయణ, తనిఖీదారుగా పి.శివతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యుకు ఎమ్మెల్యే ఎమ్మెల్యే పి.గణబాబు అభినందనలు తెలిపారు.

నాగమల్లి లేఅవుట్‌పై ఫిర్యాదు

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం చినముషిడివాడలోని సుజాతనగర్ సర్వే నంబర్ 179/2లో వేసిన నాగమల్లి లేఅవుట్ భూమిపై హక్కులు తమ వద్ద ఉండగా వేరే వ్యక్తులు లేఅవుట్ వేసి నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఫకీరుద్దీన్ అలీ అహ్మద్ వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ సర్వే నంబర్‌లో 25.95 ఎకరాల భూమి ఉండగా.. దానిపై ఆర్.జె.పాల్ పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయని, ఇప్పటికే రికార్డుల్లో ఆయన పేరే ఉందని, ఆ భూములు ప్రభుత్వ భూముల జాబితా 22-ఏలో ఉన్నాయని పేర్కొన్నారు. రికార్డులన్నీ వారి పేరుతో ఉండగా సదరం అప్పారావు అనే వ్యక్తి వుడా నుంచి లేఅవుట్ అనుమతి తీసుకున్నారని, మళ్ల సతీశ్, మళ్ల పైడితల్లమ్మ హక్కుదారులమని చెబుతూ ప్లాట్లను విక్రయిస్తున్నారని, వాటిలో నిర్మాణాలు కూడా చేస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. వీటిపై కోర్టు కేసులు కూడా నడుస్తున్నాయన్నారు.

విజ్ఞాన్‌లో జోనల్ మీట్ ఆటల పోటీలు

అగనంపూడి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజ్ఞాన్ మహోత్సవ్-2025ను పురస్కరించుకొని జోనల్ మీట్ కబడ్డీ, బాస్కెట్‌బాల్ ఆటల పోటీలను సోమవారం ప్రిన్సిపాల్ జె.సుధాకర్ ప్రారంభించారు. జోన్ పరిధిలో గల ఐదు జిల్లాల నుంచి పలు ఇంజనీరింగ్ కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కబడ్డీలో విజ్ఞాన్ జట్టు విజేతగా నిలవగా, ఎంవీజీఆర్ జట్టు బాస్కెట్ బాల్ పోటీల్లో గెలుపొందింది. విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ మధుసూదనరావు, డీన్లు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు: జెడ్సీ శేషాద్రి

పెదగంట్యాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం చేయవద్దని జెడ్సీ శేషాద్రి సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. 76వ వార్డు బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో ఆయన సోమవారం పర్యటించారు. ఆరు నెలలుగా తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావుతో కలిసి నీటి సరఫరా తీరును పరిశీలించారు. నీటి అవసరాలకు తగ్గట్టుగా పైపు లైన్లు లేకుంటే వాటిని మార్చాలని సూచించారు. రోజూ ఒకే సమయంలో కొళాయిల ద్వారా నీరొచ్చేలా చూడాలని జెడ్సీకి గంధం శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

జీతాలు చెల్లించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ రీజినల్ లేబర్ కమిషనర్ (సీఎల్‌సీ) మహంతికి ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం నగరంలో వినతిపత్రం అందజేశారు. మూడు నెలల నుంచి సరిగ్గా జీతాలివ్వడం లేదని, వేతనాల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుం దన్నారు. దీంతో ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. సీఎల్‌సీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు తౌడన్న, బయ్యే మల్లయ్య, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు. అలాగే ఉక్కు ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి తమ ఇబ్బందులను ఏకరువుపెట్టారు. జీతాలు ఇవ్వకపోయినా యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను పెంపొందించడంతో ఉద్యోగులు కీలకపాత్ర వహిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కొత్త ఆలోచనలు... సంకల్పాలు



గత ఏడాది చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం తప్పనిసరి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'కాలం నీతో నడవదు. నిన్నడిగి ముందుకు సాగదు. సంకల్పం ఒక్కటే చాలదు. దానికి సమయమే కదరా ఆయుధం'...అంటూ సాగే ఈ పాట కాలం విలువను తెలియజేస్తుంది. జీవితంలో ప్రతి క్షణమూ విలువైనదే. పోయిన కాలాన్ని వెనక్కి తిరిగి తీసుకురాలేమనేది ఈ పాట సారాంశం. అయితే, అతికొద్దిమంది మాత్రమే కాలం విలువను గుర్తిస్తున్నారు. ఎక్కువమంది సమయాన్ని వృథా చేస్తున్నారు.

ఎప్పటి మాదిరిగానే మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోయింది. కొత్త ఏడాది ప్రతి ఒక్కరి మదిలో అనేక ఆలోచనలు మెదులుతుంటాయి. అప్పటివరకు నిరుత్సాహంతో ఉండే వారికి కొత్త ఏడాది వస్తోందంటే చాలు ఉత్సాహం కట్టలు తెచ్చుకుంటుంది. కొత్త ఆలోచనలు, సంకల్పాలు మెదడును తట్టిలేపుతుంటాయి. 'ఇకపై మారాలి' అంటూ నిర్ణయం తీసుకునే వారి సంఖ్య తక్కువేమీ కాదు. అటువంటి వారంతా కొత్త ఏడాది నుంచి ఎలాంటి ఆలోచనలతో ముందుకువెళ్లాలి. తీసుకునే నిర్ణయాలను ఎలా ఆచరణలో పెట్టాలి అన్నది చాలా ముఖ్యం. న్యూ ఇయర్‌లో తీసుకునే కొత్త నిర్ణయాలు ఎలా ఉండాలి. వాటిని ఎలా అమలు చేయాలన్న దానిపై అందిస్తున్న ప్రత్యేక కథనం.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

జీవితంలో అన్నింటి కంటే విలువైనది కాలం. ఒకసారి కరిగిపోయిన కాలాన్ని వెనక్కి తీసుకురాలేము. రోజులో ఎవరికి అయినా 24 గంటలే ఉంటాయి. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వాళ్లు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తుంటారు. అటువంటి కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు ఉండాలి. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేంత వరకు ఎంత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామన్నది చాలా ముఖ్యం. వేకువజామునే నిద్ర లేవడం అలవాటు చేసుకోవాలి. అప్పటి నుంచి రాత్రి పడుకునేంత వరకు ఉన్న సమయాన్ని లెక్కగట్టి ఒక్కో పనికి కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. ఈ మేరకు షెడ్యూల్ వేసుకోవాలి.

నిర్దిష్టమైన లక్ష్యాలు అవసరం..



కొత్త ఏడాదిలో తీసుకునే రెజల్యూషన్స్ నిర్దిష్టంగా ఉండాలి. మరీ ఎక్కువ నిర్ణయాలు తీసుకున్నా వాటిని అమలు చేయడం కష్టంగా ఉంటుంది. కాబట్టి తీసుకునే నిర్ణయాలపై స్పష్టత అవసరం. అమలుకు ప్రణాళిక ముఖ్యం. కాల పరిమితి తక్కువగా పెట్టుకోవాలి. దానివల్ల లక్ష్యాన్ని సాధించే ప్రణాళికలు బలంగా ఉండడంతోపాటు ఆకాంక్ష, పట్టుదల ధృడంగా ఉంటాయి.

పొదుపు మంత్రం



ప్రస్తుతం ప్రతి అవసరానికి డబ్బు అవసరం పడుతోంది. కాబట్టి, పొదుపు మంత్రాన్ని పాటించడం అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక క్రమశిక్షణ లోపిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నెలవారీ వచ్చే ఆదాయాన్ని, ఖర్చులను లెక్క చూసుకుని కనీసం 20 నుంచి 30 శాతం పొదుపు/మదుపు చేసేలా ప్రణాళికలు వేసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. పొదుపు ఆర్థిక క్రమశిక్షణతోనే సాధ్యపడుతుంది. అనవసరపు ఖర్చులు, ఆర్భాటాలు, ఎదుటివారితో పోల్చుకుని బతకాలనే కోరెలు అప్పులు పాలయ్యేలా చేస్తాయని, ఇటువంటి వాటి విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ నిర్ణయాలు తప్పనిసరి..

కొత్త ఏడాదిలో తీసుకునే నిర్ణయాల్లో తప్పనిసరిగా కొన్ని ఉండాలని నిపుణులు బలంగా సూచిస్తున్నారు. దురలవాట్లు కలిగి ఉన్నవారు వాటికి దూరంగా ఉండడం కీలకంగా చెబుతున్నారు. స్మోకింగ్, ఆల్కహాల్, బెట్టింగ్, ఆరోగ్యానికి, జీవితానికి హాని కలిగించే ఇతర అలవాట్లకు దూరంగా ఉండాలి. వీటి బారినపడేందుకు కారణమయ్యే స్నేహాలను కూడా అవసరమైతే కొత్త ఏడాదిలో విడిచిపెట్టాలి. దురలవాట్ల వల్ల ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. కొత్త ఏడాదిలో ఇటువంటి అలవాట్లకు దూరంగా ఉండాలనే నిర్ణయాన్ని తీసుకోవాలి.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం..



ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. అన్నీ ఉన్నా ఆరోగ్యం లేకపోతే చాలా కష్టం. కాబట్టి, ఆరోగ్యంపై దృష్టిసారించేలా నిర్ణయాలు తీసుకోవాలి. ఉరుకులు, పరుగులు జీవితంలో చాలామంది ఎప్పుడు తింటున్నారో, ఏం తింటున్నారో, ఎప్పుడు పడుకుంటున్నారో, ఎప్పుడు నిద్ర లేస్తున్నారో కూడా తెలియడం లేదు. కాబట్టి, ఆహారం, వ్యాయామం విషయంలో కొన్ని కీలక నిర్ణయాలను తీసుకోవడం చాలా అవసరం. బయట ఆహారానికి దూరంగా ఉండడం, ఉదయాన్నే లేచి వాకింగ్, జాగింగ్ వంటివి చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేసినట్టు అవుతుంది.

- సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అత్యంత కీలకమంటున్న నిపుణులు
- ఆర్థిక క్రమశిక్షణ అత్యంత అవసరం

మానసిక ఉల్లాసాన్ని కలిగించేలా..

ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో ఒత్తిడి సర్వసాధారణమైంది. ఒత్తిడి వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఒత్తిడి నుంచి దూరంగా ఉండేందుకు జీవితంలో యోగా, వ్యాయామం, మెడిటేషన్ వంటివి భాగం చేసుకోవాలి. పుస్తకాలు చదవడం, కొత్త ప్రదేశాలకు వెళ్లడం వల్ల ఉత్సాహంగా ఉండే అవకాశముంది. సమయానికి భోజనం చేసేలా, తగినంత నిద్ర ఉండేలా తీసుకోవాలి.

నిత్యాన్వేషిలా ఉండాలి..

చదువుతున్నా, ఉద్యోగం చేస్తున్నా కొత్త విషయాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలి. అందుకు కొంత సమయం కేటాయించాలి. ప్రతి రంగంలోనూ పోటీ ఉంది. కాబట్టి, నిరంతర అధ్యయనంతోనే ఆయా రంగాల్లో సుదీర్ఘకాల కొనసాగేందుకు అవకాశముంటుంది. ఆ దిశగా కొత్త ఏడాదిలో నిర్ణయం తీసుకోవడం ఉద్యోగ భద్రతకు అవకాశముంటుంది.

నిర్ణయాలు అమలు చేయాలంటే...

కొత్త ఏడాదిలో తీసుకునే నిర్ణయాలను అమలు చేసే వారి సంఖ్య అతి స్వల్పమనే చెప్పాలి. అతికొద్దిమంది మాత్రమే పూర్తిస్థాయిలో అమలు చేస్తుంటారు. తీసుకున్న నిర్ణయాలను ఆచరించేందుకు ముందు మనసును సిద్ధం చేసుకోవాలి. గత ఏడాది తీసుకున్న నిర్ణయాల్లో అమలు చేసినవి ఎన్ని, చేయలేకపోయినవి ఎన్ని, దానికి గల కారణాలను విశ్లేషించుకుని వాటిని అధిగమించే ప్రయత్నం చేయాలి. సాధించగలిగే, తక్కువ లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి. లక్ష్యాలను ఒక బోర్డుపై రాసుకోవాలి. తీసుకున్న నిర్ణయాలతో ఇతరులతో పంచుకోవడం వల్ల సాధించాలన్న తపన పెరుగుతుంది. నిర్ణయాలపై ప్రతి వారం, నెల సమీక్షించుకుని ముందుకువెళ్లాలి.

సమయాన్ని సద్వియోగం చేసుకోవాలి

- ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఏయూ సైకాలజీ విభాగాధిపతి



సమయం అనేది అత్యంత విలువైనది. దానిని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలి. ఈ క్రమంలో అనేక ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. వాటిని ఇష్టంగా ఎదుర్కొంటూ ముందుకుసాగాలి. గడిచిన ఏడాది తీసుకున్న నిర్ణయాల్లో ఎన్ని అమలు చేశారు. ఎన్నింటిలో విఫలమయ్యారో గుర్తించాలి. అటువంటి వాటిని చేరుకునేందుకు అవరోధంగా నిలిచిన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి ముందుకు సాగడం ద్వారా ఈ ఏడాదిలో విజయం సాధించవచ్చు. సమయాన్ని సద్వినియోగం చేసుకునేవాళ్లు జీవితంలో విజయాలను సాధించగలుగుతారు.

నెలవారీ లక్ష్యాలను పెట్టుకోవాలి

- పూజిత జోస్యుల, మానసిక నిపుణులు



కొత్త ఏడాది అనగానే చాలా మంది పెద్ద పెద్ద లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంటారు. దానివల్ల ప్రయోజనం ఉండదు. స్వల్ప లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి. ఏం చేస్తామనే దానికంటే ఏం చేయకూడదు అనుకుంటున్నారో వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారించి అమలు చేయాలి. దీర్ఘకాలిక లక్ష్యాల కంటే నెలవారీ లక్ష్యాలను ఏర్పాటుచేసుకుని అమలు చేసుకోవాలి. మినీ గోల్ అప్రోచ్‌తో మంచి ఫలితం ఉంటుంది. ఉదాహరణకు ఈ నెలలో స్మోకింగ్, మద్యం వంటి వాటికి దూరంగా ఉంటాను అని నిర్ణయించుకుని వాటిని అమలు చేసుకోవాలి. ఎమోషనల్, సోషల్, టైమ్ బౌండరీలు పెట్టుకోవాలి. హెల్దీ రెజల్యూషన్స్ కూడా ఉండాలి. అంటే పుస్తకాలు చదవడం వంటివి కూడా లక్ష్యాలుగా పెట్టుకోవాలి.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 236 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

మహారాణిపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు ప్రత్యేక వసతి, హెల్ప్ డెస్క్‌లు, తాగునీటి సదుపాయం కల్పించారు. 236 అర్జీల్లో రెవెన్యూ విభాగానికి 101, జీవీఎంసీకి 39, పోలీసు శాఖకు 23, ఇతర శాఖలకు సంబంధించి 73 ఉన్నా యి. ఈ కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి అప్పన్న ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు

సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి వచ్చేనెల 17 వరకు పగల్‌పత్తు ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం ప్రభాతారాధనలు, సేవలు తరువాత తిరువీధి చేపట్టనున్నారు. ఉత్సవాల సందర్భంగా వేకువజామున జరిగే సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనల టికెట్ల విక్రయాలతో పాటు ఆర్జిత నిత్య కల్యాణం, గరుడసేవ, సహస్రనామార్చన, స్వర్ణ తులసీదళార్చన, స్వర్ణ పుష్పార్చనలను రద్దు చేస్తున్నట్టు ఈఓ వేండ్ర త్రినాథరావు ప్రకటించారు.

భక్తుడికి అప్పన్న దేవస్థానం ఉద్యోగి టోకరా

సింహాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భక్తులకు అతి శ్రీఘ్రదర్శనం, అంతరాలయ దర్శనం కల్పిస్తానని ఓ ఉద్యోగి రూ.1800 కాజేశాడు. హైదరాబాద్‌కు చెందిన దిలీప్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 28న స్వామిదర్శనానికి వచ్చారు. అతిశ్రీఘ్ర దర్శనం టికెట్ల కోసం క్యూలో వెళుతుండగా దేవస్థానం పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కింతాడ అప్పలరాజు అతిశ్రీఘ్ర దర్శనం చేయిస్తానని నమ్మించి రూ.1800 వసూలు చేసి క్యూలో పంపాడు. నీలాద్రి గుమ్మం వద్ద అంతరాలయంలోకి అనుమతిచ్చే ఉద్యోగి టికెట్లు అడగ్గా దేవస్థానం ఉద్యోగి డబ్బు తీసుకుని పంపారని తెలిపారు. సదరు ఉద్యోగిని తీసుకురావాలని వారిని వెనక్కి పంపేశారు. దీంతో బయటకు వచ్చి అతడికోసం వెతికినా కనిపించలేదు. దీంతో బాధితుడు పీఆర్ఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దేవస్థానం పరిపాలనా విభాగం ఏఈఓ రాజేంద్రకుమార్‌ను వివరణ కోరగా తమకు ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

సీఐడీ కార్యాలయ అధికారులకు అవార్డులు


అవార్డులు సాధించిన అధికారులు

ఆరిలోవ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఐడీ కార్యాలయంలో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు అందాయి. విశాఖపట్నం రీజనల్ కార్యాలయానికి మూడు అవార్డులు వచ్చాయి. ఎం.శేషు ఇన్‌స్పెక్టర్, బెస్ట్ ఇన్‌ఇన్వెస్టిగేషన్ విభాగంలో కె.పైడపునాయుడు బెస్ట్ ఎకనామిక్ అఫెన్సింగ్ వింగ్, ఉత్తమ రీజనల్ కార్యాలయంగా ప్రేమ్ కాజల్ అడిషనల్ ఎస్పీకి రోలింగ్ అవార్డులు దక్కాయి.

రాజీవన్ ఆస్పత్రికి వీఎంఆర్‌డీఏ నోటీసులు

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రి పక్కన రాజీవన్ ఆస్పత్రికి కేటాయించిన భూమిలో భారీ అపార్టుమెంట్ నిర్మిస్తున్నారని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఫిర్యాదు చేయడంతో వీఎంఆర్‌డీఏ అధికారులు సంబంధితులకు నోటీసు జారీచేశారు. రేసపువానిపాలెం సర్వే నంబర్ 6లో 4,540 చ.గజాల భూమిని నర్సింగ్ హోమ్/ఆస్పత్రి నిర్మాణానికి రాయితీ ధరపై గజం రూ.200కే ఇచ్చినట్టు అధికారులు ఆ నోటీసులో పేర్కొన్నారు. ప్రస్తుతం అందులో భారీ అపార్టుమెంట్ నిర్మాణం చేపడుతున్నారని, అది సేల్ డీడ్ నిబంధనల అతిక్రమణ కిందకు వస్తుందని, దీనికి సమాధానం ఇవ్వాలని కోరారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు


పరుగు పోటీ పరిశీలిస్తున్న డీఐజీ, అనకాపల్లి ఎస్పీ

విశాలాక్షినగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో సోమవారం నుంచి అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లాల అభ్యర్థులకు ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలను డీఐజీ గోపీనాథ్ జెట్టీ సందర్శించారు. తొలిరోజు 600 మంది పురుష అభ్యర్థులకు 233 మంది హాజరయ్యారు. అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, సైబర్ సెల్ ఎస్ఐ టి.కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫిట్ ఇండియా వారోత్సవాలు



విద్యార్థులతో విప్ గణబాబు, సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా వారోత్సవాలు సోమవారం ముగిశాయి. గోపాలపట్నం ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఎమ్మెల్యే గణబాబు, సీపీ శంఖబ్రతబాగ్చి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ గణబాబు మాట్లాడుతూ క్రీడారంగంలో రాణించేందుకు విద్యార్థి దశ కీలకమన్నారు. బాక్సింగ్‌లో ఉన్నత స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్ది ద్రోణాచార్య అవార్డు అందుకున్న ఐ.వెంకటేశ్వరరావు, వెయిట్‌లిఫ్టింగ్‌లో అర్జున అవార్డు అందుకున్న నీలంశెట్టి లక్ష్మి లను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇండోర్ స్పోర్ట్సు ఎరీనా ఉన్న ఏకైక పాఠశాల కావడం గర్వకారణమన్నారు. పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ ఉన్నత పాఠశాల ఇండోర్ స్పోర్ట్సు స్టేడియం ఉండడం ముదవహమన్నారు. విద్యార్థులు ఉన్నత క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ.వెంకటేశ్వరరావు, కంచరాన సూర్యనారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ జేడీగా మనోజ్‌కుమార్



విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈఎస్ఐ (కార్మిక రాజ్య బీమా సంస్థ) ఉప ప్రాంతీయ కార్యాలయం నూతన సంయుక్త సంచాలకులు (ఇన్‌చార్జి)గా మనోజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విశాఖలో పనిచేసిన జోస్ మార్టిన్ పదోన్నతిపై ఢిల్లీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బెంగళూరులో పనిచేస్తున్న మనోజ్‌కుమార్ పదోన్నతిపై వచ్చారు. ఈఎస్ఐలో 2010లో ఉపసంచాలకుగా నియమితులై బరోడా, సూరత్, బెంగళూరులో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన మనోజ్‌కుమార్‌కు కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నూతన సంవత్స క్యాలెండర్, డైరీలను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్, గౌరవాధ్యక్షుడు అనకాపల్లి పైడిరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మోసం కేసులో నిందితుడికి జైలు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని మోసం చేసిన కేసులో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్దిలపాలెం భానునగర్‌కు చెందిన గౌరి ట్రావెల్స్ నడుపుతోంది. వెల్లంకి రామారావు 2018లో కారును అద్దెకు తీసుకుని అద్దెతో పాటు కారును తిరిగి అప్పగించలేదు. దీంతో ఎంవీపీ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో వెల్లంకి రామారావుకు న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించినట్టు సీఐ మురళి తెలిపారు.

విధుల్లో చేరిన పది మంది వార్డర్లు

ఆరిలోవ డిసెంబరు 30: (ఆంధ్రజ్యోతి) విశాఖ కేంద్ర కారాగారంలో ప్రశాంత వాతవరణం నెలకొందని జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. 37 మంది వార్డర్లను రిలీవ్ చేసి, వివిధ జైళ్లకు అటాచ్‌మెంట్ బదిలీ ఉత్తర్వులు ఇచ్చామన్నారు. వారి స్థానంలో సోమవారం పది మంది విధుల్లో చేరారన్నారు. సమస్యలన్నింటినీ కొలిక్కి తీసుకువచ్చిన ఉత్తరాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం వెళ్లారన్నారు.

నేడు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో జాబ్ మేళా

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. నిపుణ ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, మెడ్ ప్లస్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, ఎలక్ట్రీషియన్, ఇతర డిగ్రీ, డిప్లొమో ఈఈఈ పూర్తి చేసిన వారు అర్హులని, ఎంపికైన వారంతా విశాఖ జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9948768778 నంబరులో సంప్రదించాలన్నారు. ఆధార్‌తో లింకైన మొబైల్‌తో హాజరు కావాలన్నారు.

హోంగార్డు సస్పెన్షన్

మహారాణిపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోయిన సెల్‌ఫోన్ రికవరీ కోసం బాధితుడి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన హోంగార్డును సస్పెండ్ చేసినట్టు సీపీ శంఖబ్రాత బాగ్చి తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా విచారణ జరపగా, నేరం రుజువు కావడంతో హోంగార్డు ఎం.కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేశామన్నారు. పోలీసు సిబ్బంది అవినీతికి పాల్పడితే 7995095799 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.